29-03-2024
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 281
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM






# మద్యం కేసు రాజకీయ కుట్ర

## ప్రజలే తీర్పు ఇస్తారు

### కోర్టు వెలుపల మీడియాతో కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** మద్యం అవినీతి అరోపణల కేసు కేవలం రాజకీయ కుట్రేనని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గురువారం న్యూఢిల్లీలోని రౌస్ ఎవెన్యూలో ఉన్న ప్రత్యేక కోర్టుకు తరలించిన సందర్భంగా కేజ్రీవాల్ మీడియతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజు విధానంలో అవినీతి జరిగిదంటూ ఆరోపణలు చేయడం వట్టి రాజకీయ కుట్రేనన్నారు. ఈ విధమైన రాజకీయ కుట్రలకు ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని కోర్టు గదిలోకి ప్రవేశిస్తూ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రులు అతిశ్, గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్‌లు కూడా కేజ్రీవాల్ కోర్టులోకి ప్రవేశించేటప్పుడు ఆయన వెంట ఉన్నారు. కేజ్రీవాల్ సతీమణి సునీత కూడా ఆయన కూడా ఉన్నారు. ఒక కీలకమైన ప్రకటన కేజ్రీవాల్ చేస్తారని ఆయన సతీమణి సునీతా ఒక రోజు క్రితం ప్రకటన చేసిన పూర్వరంగంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మరో నాలుగు రోజులు ఇడి కస్టడీలోనే**


ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరో నాలుగు రోజులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీలోనే ఉంటారు. ఏప్రిల్ 1వ తేదీ వరకూ ఆయన కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూలోని ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో వారం రోజులు ఆయన్ను తమ కస్టడీలోనే ఉంచుకునేందుకు అనుమతించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కోరినప్పటికీ కోర్టు తిరస్కరించింది. నాలుగు రోజులు మాత్రమే కస్టడీకి అనుమతించింది. పొడిగించిన కస్టడీ గడువు ముగిశాక వచ్చే ఒకటోతేదీ ఉదయం 11 గంటలకు కోర్టు ఎదుట కేజ్రీవాల్‌ను తరువాయి 2లో

## జైలు నుండి పాలనకు క్లియరెన్స్

జైలు నుండి పరిపాలనా విధులు నిర్వహిస్తున్న ఢిల్లీ ముఖ్యంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అభ్యంతరాలన్నీ తొలగిపోయాయి. జైలు నుండి పాలనా ఆదేశాలు జారీ చేయడాన్ని తప్పుపడుతూ ఢిల్లీకి చెందిన సుర్జీత్ సింగ్ అనేక వ్యక్తి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తి మన్మోహన్ తీర్పు చెబుతూ కొన్ని ఆచరణాత్మక ఇబ్బందులున్నప్పటికీ, ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. దీంతో బిజెపి ఇప్పటివరకూ చేస్తున్న విమర్శలకు సమాధానం లభించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ జైలు నుండి పరిపాలన నడవబోదని వ్యాఖ్యానించారు. కోర్టు మాత్రం పరిపాలనకు న్యాయపరమైన ఎలాంటి అడ్డంకులూ కేజ్రీవాల్‌కు ఉండవని స్పష్టం చేసింది. మార్చి 21వ తేదీన కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు.

## విచారించిన కొద్దీ... వెలుగులోకి కొత్త పేర్లు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో అదుపులోకి మాజీ డిసిపి రాధాకిషన్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్

'ఫోన్ ట్యాపింగ్' కేసులో దర్యాప్తు బృందం ఒక మాజీ డిసిపి, ఇన్‌స్పెక్టర్‌ను అదుపులోనికి తీసుకుని విచారించింది. ఈవిచారణలో మరిన్ని కొత్త కోణలు వెలుగులోనికి వచ్చాయి. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లును విచారించారు. ఫోన్ ట్యాపింగ్ సమాచారం ఆధారంగా కొందరిని విచారించగా, మరి కొందరి నుండి డబ్బులు కూడా వసూలు చేసినట్టు సమాచారం. ఇంకొదరిని బెదిరింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. తీగ లాగితే డొంక కదిలినట్టు ఈ కేసులో మరి కొంత మంది పేర్లు వెలుగులోనికి వస్తున్నాయి. ఈ కేసుతో రాష్ట్రంలోని సింహభాగం జిల్లాలతో ముడిపడినట్టు తెలుస్తోంది. కాగా ఎఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న కస్టడీ విచారణలో మరిన్ని కీలకమైన అంశాలు, మరి కొందరు పేర్లు కూడా వెలుగులోనికి వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పాత్రదారుల పేర్లు వెలుగులోనికి వస్తున్నప్పటికీ ఈ కేసులో అసలు సూత్రదారులు ఎవరన్న అంశంపైనే దర్యాప్తు సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టింది. గొలుసు కట్టు తరహాలో పాత్ర దారుల పేర్లు తరువాయి 2లో



## ఏడు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్

### రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ముందస్తుగానే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఆరుబయట పనిచేసవారు, పగటిపూట రాకపోకలు సాగించేవారు తరువాయి 2లో



## వాట్సాప్, ఫోన్ కాల్స్‌పై నేటి నుంచి కొత్త నియమాలు

### లోక్‌సభ ఎన్నికల నేపథ్యం అధికారిక ప్రకటన

**న్యూఢిల్లీ:** త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫోన్ కాల్స్‌పై కొత్త కమ్యూనికేషన్ నియమాలు శుక్రవారం నుంచి అమలుకానున్నాయి. అధికారిక ప్రకటనను అనుసరించి, మీ అన్ని కాల్స్ రికార్డింగ్ అవుతాయి. ఆ రికార్డింగ్స్‌ను సేవ్ చేస్తారు. వాట్సాప్, ఫేస్‌బుక్, 'ఎక్స్' (ట్విట్టర్)సహా అన్ని సోషల్ మీడియాలపై పర్యవేక్షణ ఉంటుంది. మీ పరికరాలు మినిస్ట్రీ సిస్టమ్స్‌కు కనెక్ట్ అవుతాయి. ఎవరికీ తప్పుడు తరువాయి 2లో

## దేశంలో పది పార్టీలకు ఐదు కంపెనీల నుండి భారీగా ఎన్నికల బాండ్ల నిధులు

### ఎడిఆర్ నివేదిక


**న్యూఢిల్లీ :** ఎన్నికల బాండ్ల ద్వారా దేశంలో పది పార్టీలకు భారీగా నిధులు సమకూర్చిన ఐదుగురు ప్రముఖ దాతల వివరాలను ఎక్స్ వేదిక ద్వారా ఎడిఆర్ గురువారం నాడు షేర్ చేసింది. ప్రధానంగా దేశంలో బిజెపి, కాంగ్రెస్, టిఎంసి, బిఆర్‌ఎస్, బిజెడి, డిఎంకె, వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి, శివసేన, ఆర్‌జెడి పార్టీలు ఈ ఐదుగురు దాతల ద్వారా లబ్ధి పొందాయి. ఎన్నికల సంస్కరణలకోసం పాటు పడుతున్న స్వచ్ఛంధ సేవాసంస్థ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఎడిఆర్) చెప్పిన సమాచారం ప్రకారం, ఎన్నికల బాండ్లద్వారా ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ ప్రైవేట్ సంస్థ మూడు ప్రాంతీయ పార్టీలకు భారీస్థాయిలో రూ.1,200 కోట్లు ముట్టజెప్పిందని తన నివేదికలో వెల్లడించింది. జాతీయ పార్టీగా అవతరించిన తృణమూల్ కాంగ్రెస్, పాంతీయ పార్టీలు ద్రవిడ మున్నేట్ర కజగం, వైఎస్‌ఆర్‌సిపిలకు ఎన్నికల తరువాయి 8లో

## బిఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

### పోటీ నుండి తప్పుకున్న కడియం కావ్య



**వరంగల్ :** బిఆర్‌ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఒకవైపు పార్టీ జనరల్ సెక్రటరీ కె. కేశవరావు బిఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించగా, మరో వైపు వరంగల్ లోక్‌సభ స్థానానికి బిఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య తాను పోటీ నుండి తప్పుకుంటున్నట్లు గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. ఇటీవల కాలంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులపై వస్తున్న అవినీతి ఆరోపణలు, భూకబ్జాలతో పాటు లిక్కర్ కుంబకోణంలో కవిత పాత్ర, ఫోన్ ట్యాపింగ్ తదితర వ్యవహారాలలో బిఆర్‌ఎస్ నాయకుల అధినేతల పాత్రతో తాను ఆందోళన చెంది పోటీ నుండి విరమించుకుంటున్నట్లు తెలిపారు. తనకు వరంగల్ పార్లమెంటు స్థానంలో బిఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత తరువాయి 8లో



## 30న కాంగ్రెస్‌లోకి హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు, ఆయన కుమార్తె, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఈ నెల 30న కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో కేశవ్ రావు, విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరే అంశంపై స్పష్టతనిచ్చారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, 84 ఏళ్ల వయసులో తిరిగి సొంత పార్టీకి వెళ్లాలని తరువాయి 2లో




## పార్ట్ టైమ్ ఉద్యోగుల స్కామ్‌లో రూ.32.34 కోట్లు జప్తు చేసిన ఇడి

ప్రజాపక్షం/హైదరాబాద్

పార్ట్ టైమ్ ఉద్యోగుల స్కామ్‌లో రూ.32.34 కోట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ స్టేషన్(సిసిఎస్) కేసు ఆధారంగా ఇప్పటి వరకు 175 బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 524 కోట్లను కాజేసినట్టు ఈడి గుర్తించింది. ఈ నిధులను మరో 480 ఖాతాలకు మళ్లించి, క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో దేశం దాటిస్తున్నట్టు ఇడి దర్యాప్తులో తేలింది. పార్ట్ టైమ్ జాబ్‌ల పేరుతో జరిగిన మోసాలపైన హైదరాబాద్ సైబర్ క్రైమ్ స్టేషన్ లో 50కిపైగా ఎఫ్‌ఐఆర్‌లను నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడి దర్యాప్తు చేస్తోంది. సైబర్ నేరగాళ్ల వాట్సాప్, టెలిగ్రామ్ తరువాయి 2లో

# 100 శాతం పోలింగ్

### ప్రశాంతంగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నిక పోలింగ్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామా చేయడంతో, ఆ స్థానం భర్తీకి గురువారం నిర్వహించిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 100 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎఆర్ఒ వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఉప ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్ గౌడ్ పోటీ చేశారు. ఇద్దరు ఎంపిలు, 14 మంది శాసనసభ్యులు, ముగ్గురు ఎంఎల్‌సిలు, 888 మంది ఎపిటిసిలు, 83 మంది జెడ్‌పిటిసిసిలు, 449 మంది కౌన్సిలర్లు కలిపి మొత్తం 1,439 మంది ఓటర్లుకు పది పోలింగ్ కేంద్రాల్లో 1437 (99.86 శాతం) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ ఎంపిడిఒ కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి, కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఉప ఎన్నికను అధికార తరువాయి 2లో





## అన్ని రంగాలలో కొడంగల్‌ను అభివృద్ధి చేస్తా

### నా ప్రతీ కష్టకాలంలోనూ నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నారు : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం /వికారాబాద్/ కొడంగల్

'నా ప్రతీ కష్టంలో కొడంగల్ ప్రజలు అండగా ఉన్నారు. నేను ఎక్కడికి వెళ్లిన నేను మీ బిడ్డనే. నాకు ఇంత చేసిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఉప ఎన్నికలో గురువారంకొడంగల్‌లో సిఎం ఓటు వేశారు. అనంతరం తన నివాసంలో కొడంగల్ ప్రజలతో ప్రత్యేకంగా సిఎం మాట్లాడారు. తన గెలుపునకు కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కొడంగల్ ప్రాంతం అభివృద్ధి కావాలని, అందుకు ప్రజలు సహాయసహకారాలు అందించాలన్నారు. తన లక్ష్యం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమేనన్నారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు తరువాయి 2లో

## తక్షణమే రూ.270 కోట్లు చెల్లించాలి

### చేనేత కార్మికులకు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రికి చాడ వెంకట్ రెడ్డి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



సిరిసిల్లలోని పవర్‌లూమ్ పరిశ్రమకు బతుకమ్మ చీరలు, ఇతర బకాయిలకు సంబంధించిన రూ.270 కోట్లు తక్షణమే చెల్లించాలని, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు అందించాల్సిన పథకాలకు నిధులను విడుదల చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎంకు గురువారం నాడు ఆయన లేఖ రాశారు. సిరిసిల్లలో గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరలకు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో చేనేత పరిశ్రమ కుదేలైందని, కార్మికులకు పని లేక వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని గత 45 రోజులుగా పవర్ లూమ్ కార్మికులు ఆందోళనబాట పట్టారని, భిక్షాటన కార్యక్రమాలు, నిరవధిక నిరాహార దీక్షలకు కార్మికులు నిర్వహించారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నదని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించకపోవంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మూతపడి రోజు కూలి చేసుకునే కార్మికులకు ఉపాధి కరువై తరువాయి 2లో

## ఉపాధిహామీ దినసరి వేతనాలు పెంపు

### తెలుగు రాష్ట్రాల్లో రూ.300 బిజెపి పాలిత హర్యానాలో రూ.374 కూలీ

### ఎన్నికల సంఘం ఆమోదంతోనే కేంద్రం ప్రకటన



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నైపుణ్యంలేని గ్రామీణ కూలీలకు ఇచ్చే వేతనాలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ వేతనాలను రాష్ట్రాల వారీగా నాలుగు శాతం నుండి పదిశాతం మేరకు పెంచారు. దేశంలో అత్యధికంగా బిజెపి పాలిత హర్యానా రాష్ట్రంలో ఈ పథకం కింద దినసరి వేతనం రూ.374లు ఉంది. ప్రస్తుత సవరణలో హర్యానా రాష్ట్రానికి నాలుగుశాతం మాత్రమే పెంచినప్పటికీ ఆ రాష్ట్రంలో దేశంలోనే అత్యధిక వేతనం నమోదవుతున్నది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లలో రూ.234 ఇస్తారు. ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు పదీ శాతం మేరకు పెంచారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దినసరి వేతనం రూ.28లు తరువాయి 2లో


# అడుగంటుతున్న భూగర్భజలాలు

### పంటలు కాపాడుకునేందుకు రైతుల తిప్పలు

### పశువులకు మేతగా మారుతున్న పంట

### సాగునీరు అందించాలని వేడుకోలు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి






ఎండాకాలం ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఏప్రిల్ నెల రాక ముందే మార్చిలోనే ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. వచ్చే మే నెలలో రోళ్లు పగిలే ఎండలు రాకముందే ఇప్పటికే బావులు, చెరవులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. జిల్లాలోని పలు మండలాలలో, గ్రామాల్లోని చెరువులు, కుంటలు, బావులు భూగర్భ జలాలు లేక అడుగంటి పోతున్నాయి. రైతులు ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న పంటలను దక్కించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బోరు బావులు, కుంటల్లో నీటి నిల్వలు లేక పంట ఎండిపోతుంటే అన్నదాతలకు ఆందోళన మొదలైంది. ఇంకా పంట చేతికి వచ్చే సరికి నెలన్నర నెలల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో వరి, తరువాయి 2లో

## ఖమ్మం అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్ జాప్యం

### బిఆర్‌ఎస్ ప్రచారం శూన్యం

### కార్యకర్తల్లో నైరాశ్యం

ప్రజాపక్షం/ ఖమ్మం



ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిని ప్రకటించకుండా జాప్యం చేస్తుండగా, అభ్యర్థిని ప్రకటించినా బిఆర్‌ఎస్ కార్య రంగంలోకి రాలేదు. అభ్యర్థిని ప్రకటించిన తర్వాత కూడా సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బిజెపి కార్యకర్తల్లో ఆయన అయితే బాగుండేది ఇయనకు ఇచ్చారన్న భావన వ్యక్తమవుతుంది. మొత్తంగా ప్రధాన పార్టీల కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి ఎంపిక చిక్కుముడి పడిన నేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్ అగ్ర నేతల్లో ఒకరైన ప్రియాంక గాంధీ పేరు తెరపైకి తెచ్చారు. ఎవరిని అడ్డుకునేందుకో లేక ఎవరి మెప్పు కోసమో కానీ మరుగునపడిన ప్రియాంక గాంధీ పేరు తెర మీదకు వచ్చింది. ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు పోటీ పడుతుండటం, వీరితో పాటు టికెట్ రేసులో తరువాయి 2లో

# మావోయిస్టు డిప్యూటీ కమాండర్, కొరియర్ అరెస్ట్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు ఎల్ఓఎస్ డిప్యూటీ కమాండర్‌తో పాటు మరో మావోయిస్టు కొరియర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా, గంగలూరు పిఎస్ పరిధిలోని పూస్నార్ గ్రామానికి చెందిన ఎస్ఓఎస్ కమాండర్ పుట్టం మున్నా అలియాస్ సన్నాల్, ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన మావోయిస్టు కొరియర్ జాడి పెద్దబ్బాయిలు ఉన్నారు. ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సిఆర్‌పిఎఫ్ 151 బెటాలియన్, 204 బెటాలియన్ కో బ్రా బలగాలు దుమ్ముగూడెం మండల పరిధిలోని ములకనపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇరువువు తారసపడటంతో వారిని పశ్నించారు. వారు మావోయిస్టులుగా ఒప్పుకోవడం అరెస్టు చేశారు. డిప్యూటీ కమాండర్ మున్నా 2004 నుండి మావోయిస్టు దళంలో పనిచేస్తున్నాడు. మడివిహిడ్మా, సంతోష్ నాయకత్వంలో పనిచేశాడు. పలు విధ్వంకర సంఘటనలలో పాల్గొన్నాడు. 2007లో తాడిమెట్ల వద్ద 12 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను చంపిన ఘటనతో పాటు, 2010 లో చింతల్నార్ అటవీ ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 76 మంది జవాన్లను హతమార్చిన ఘటన, 2013లో కిష్టారం వద్ద సిఆర్‌పిఎఫ్ జనాన్లను, 2018 లో 9 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను, 2021లో జిరాం ఘాట్ సంఘటనలో 21 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటన, ఇటీవల ఏర్పాటు చేసిన ధర్మారం బేస్ క్యాంపుపై దాడిచేసిన ఘటనలో నింధితుడు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఇతనిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. అరెస్టు కాబడ్డ కొరియర్ గత మూడేళ్లుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఫస్ట్ బెటాలియన్ మావోయిస్టులకు కొరియర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరి వద్ద నుండి ఒక కిట్‌బ్యాగు, పది జిలిటెన్ స్టిక్స్, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, మావోయిస్టు కరపత్రాలు స్వాదీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

## నేటి నుంచికొత్త నియమాలు

(మొదటి పేజీ తరువాయి)

సందేశాలు పంపకుండా జాగ్రత్త వహించాలి. తక్కువ సోషల్ వెబ్ సైట్లను ఉపయోగిస్తే మంచిది. రాజకీయాలు లేదా వర్తమాన వ్యవహారాలపై ప్రభుత్వం లేదా ప్రధానమంత్రి ఇతర అధికారులపై మీ పోస్టులు లేదా వీడియోలు పంపవద్దు.

ప్రస్తుతం ఏదైనా రాజకీయ లేదా మతపరమైన విషయాలపై సందేశాలు రాయడం లేదా పంపడం నేరం...అలా చేస్తే మిమ్మల్ని వారెంట్ లేకుండా అరెస్టు చేయవచ్చు.

ముందుగా పోలీసులు నోటిఫికేషన్ జారీ చేస్తారు... సైబర్ క్రైమ్ వారు తర్వాత... చర్య తీసుకుంటారు, ఇది చాలా తీవ్రమైనది.

దయచేసి మీరందరు గ్రూప్ సభ్యులు మీమీ పరిధిని గుర్తెరిగి అడ్మిషన్లకు సహకరించే విధిగా మీమీ గ్రూపు లేదా సమూహాలలో వ్యవహరించండి..దయచేసి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించండి.

ఎటువంటి తప్పుడు సందేశాన్ని పంపకుండా జాగ్రత్త వహించండి.

దయచేసి దీన్ని భాగస్వామ్యం చేయండి..సమూహాలు కొన్నాళ్ళు మరింత అప్రమత్తంగా ఉండాలి.!

గ్రూపు సభ్యులకు WhatsApp గురించి ముఖ్యమైన సమాచారం...క్రింది విధంగా..

వాట్సాప్‌లో సమాచారం

✓= సందేశం పంపబడింది.

✓✓= సందేశం బట్వాడా చేయబడింది..

రెండు నీలం ✓✓= సందేశం చదవబడింది..

మూడు నీలం ✓✓✓= ప్రభుత్వం సందేశాన్ని నోట్ చేసింది.

రెండు నీలం మరియు ఒక ఎరుపు ✓✓✓= ప్రభుత్వం మీపై చర్య తీసుకోవచ్చు..

ఒక నీలం మరియు రెండు ఎరుపు = ప్రభుత్వం మీ సమాచారాన్ని తనిఖీ చేస్తోంది

తీన్ లాల్ ✓✓✓= ప్రభుత్వం మీపై చర్యను ప్రారంభించింది మరియు త్వరలో మీకు కోర్టు సమన్లు అందుతాయి..బాధ్యతగల పౌరుడిగా ఉండండి మరియు మీ స్నేహితులతో ఈ విషయాన్ని పంచుకోండి..

## ఆరెంజ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఎండవేడిమితో సతమతమవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగ మండుతుండటంతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్ళేందుకు జంకుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత, వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం వరకు వేడి తగ్గడం లేదు. రానున్న రోజుల్లో ఎండలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రహదారులు, సిగ్నల్స్ వద్ద వాహనదారులు నరక యాతన పడుతున్నారు. ఎండలో నడిచే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలంటున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల మధ్య బయటకు వెళ్ళకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.

## 100 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. వచ్చే నెల ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు జరగనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ పెట్టెలను మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. కాగా, మహబూబ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రంలో మొత్తం 245 మందికి గానూ అందరూ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలాల పరిధిలోని 56 మంది ఓటర్లు ఉండగా అందులో ముగ్గురు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు 40 మంది మండల పరిషత్ పాదేశిక నియోజకవర్గం సభ్యులు , 12మంది మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు స్థానిక సంస్థల ఎక్స్ ఆఫీషియో సభ్యులైన శాసన సభ్యులు కొడంగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో 10 మండలాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 10 మండలాల్లో మొత్తం 171మంది ఓటర్లకు గాను 94మంది మహిళా ఓటర్లు, 75మంది పురుష ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలకేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌కే ంద్రాలలో ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. పోలింగ్ సమయం ముగిసే సమయానికి 319 ఓట్లకుగాను 318 ఓట్లు పోలు కాగా 99.69 శాతం నమోదైందని తెలిపారు. కొల్లాపూర్ 6వ నెంబర్ పోలింగ్‌కేంద్రానికి సంబంధించిన 67మంది ఓట్లకుగాను 67 ఓట్లు వంద శాతం పోలయ్యాయి. నాగర్‌కర్నూల్ 7వ నెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 101 ఓట్లకుగాను 100 ఓట్లు 99.99 శాతం పోలయ్యాయి. అచ్చంపేట 8వనెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 79 ఓటర్లకుగాను 79 వందశాతం పోలయ్యాయి. కల్వకుర్తి 9వనెంబర్ పోలింగ్‌కేంద్రానికి సంబంధించిన 72 ఓటర్లకుగాను 72ఓట్లు వందశాతం పోలయ్యాయి. పోలింగ్‌కేంద్రాల నుండి నేరుగా మహబూబ్‌నగర్ రిసీవింగ్ కేంద్రానికి బ్యాలెట్‌బాక్స్‌లను పటిష్టభద్రత మధ్య తరలించనున్నట్లు తెలిపారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ఆర్‌డిఓ దామోదర్ రావు



**ప్రజాపక్షం/భద్రాచలం :** సీతారాములు కళ్యాణ మహోత్సవానికి, పట్టాభిషేకానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఓ దామోదర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ సమావేశ మందిరంలో శ్రీరామనవమి ఏర్పాట్లు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణం జరిగే మిథిలా స్టేడియంలో 26 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. ప్రతీ సెక్టార్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలు వీక్షించేందుకు చర్యలు చేపేడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం పర్యవేక్షకులుగా జిల్లా అధికారులు ఉంటారన్నారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా లాడ్జీలు బుక్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా ఇప్పటికే ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తామని, విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక కార్డులు జారీ చేస్తామన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు పట్టణాన్ని 25 జోన్లుగా విభజించామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి సదుపాయంతో పాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు గోదావరిలో స్నానాలకు దిగుతుండారని, నదీలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కళ్యాణ మండపంలోనికి వచ్చే సమయంలో రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదిపై ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవాలని, అత్యసర పరిస్థితుల్లో వాహనాలు నిలిచిపోతే వాటిని క్రేన్ల ద్వారా తరలించేందుకు ఏర్పా ట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఒక్క రోజు ముందు నుండే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ఆస్పత్రిలో బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తలంబ్రాల పంపిణీ విషయంలో ఎలాంటి లోటు పాట్లు దొర్లకుండా ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు సమగ్ర సమచారాన్ని అందించేందుకు సమాచార కేంద్రాలు 24 గం. పాటు పనిచేయాలని, ఉత్సవాలు మూగిసేంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సిబ్బంది పనిచేసి వేడుకలు విజవతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.32.34 కోట్లు ఇడి అటాచ్

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నిరుద్యోగులకు వల వేశారు. హోటల్స్, టూరిస్ట్ వెబ్‌సైట్లు, రిసార్టులు వంటి వాటికి రేటింగ్ ఇస్తే ఆదాయం వస్తుందని సదరు సంస్థ ప్రతినిధులు నమ్మించారు. బోగస్ మొబైల్ అప్లికేషన్లను సృష్టించి, పెట్టుబడులను పెట్టించారు. యుఎఇలో ఉన్న కీలక నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. భారతదేశంలో బ్యాంక్ ఖాతాలను సేకరించి, వాటిలో సైబర్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును ఆ ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఇప్పటి వరకు 175 ఖాతాల ద్వారా రూ.524 కోట్లను కాజేశారు.

## రూ.270 కోట్లు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చాడ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన చేనేతకు చేయూత పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో కార్మికులకు ప్రతినెల రంగు, రసాయనాలు, త్రిఫ్ట్ పథకానికి ఇవ్వాల్సిన డబ్బులు కార్మికుల ఖాతాలలో జమ చేయకపోవడంతో కార్మికులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సిఎంకు రాసిన లేఖలో చాడ తెలిపారు. ఇప్పటి వరకు సిరిసిల్లా వరకు ఉన్న చేనేత కార్మికుల ఆందోళన రాష్ట్ర వ్యాపితంగా విస్తరించకుండా వారి సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని చేనేత, పవర్లూమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు.

## వెలుగులోకి కొత్త పేర్లు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడువుతున్నప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌లో వెల్లడైన సమాచారాన్ని ఎవరికి ఇచ్చారు?, ఈ సమాచారం ఆధారంగా ఎవరిని విచారించారు?, వారిపై ఏమైనా కేసులు నమోదు చేశారా? చేస్తే ఆ కేసుల పురోగతి ఏమిటనే కోణంలో దర్యాప్తు బృందం ప్రత్యేకంగా విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌లో విదేశీ పరికరాల ఉపయోగంతో ఇందుకు సహకరించిన వారి పేర్లను అడిగి తెలుసుకుంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన ప్రదేశాలపై కూడా తీస్తున్నట్టు తెలిసింది. దీనికి అయ్యే ఖర్చులను కూడా అంచనా వేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, రియల్, ఇతర వ్యాపారుల ఫోన్స్‌ను కూడా ట్యాపింగ్ చేశారని, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను ఒక యూనిట్‌గా చేసి, ఈరెండు జిల్లాల వార్ రూమ్‌ను నల్లగొండలోని ఒక భవనంలో ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా శాసనసభ సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన పలు ఉప ఎన్నికలు జరిగి నియోజకర్గాల్లో కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### భుజంగరావు, తిరుపతన్నకు ఐదు రోజుల కస్టడీ

ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్నను ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి నాంపల్లి న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావును మరో ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలన్న పిటిన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది.

## కాంగ్రెస్ జాప్యం

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక వేత్తలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండడంతో అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి ఇబ్బందిగా మారింది. తప్పనిసరిగా కాంగ్రెస్ దే విజయమన్న ఖమ్మం స్థానం అభ్యర్థి ఎంపిక జాప్యం కార్యకర్తల్లో నైరాశ్యానికి గురి చేస్తుంది.

**కదలని కారు :** భారత రాష్ట్ర సమితి తొలి దశలోనే ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి నామ నాగేశ్వరరావును ప్రకటించినా ప్రచారం ఎక్కడ ప్రారంభించ లేదు. నామ ఇంట్లో వివాహ కార్యక్రమం ముగిసి పది రోజులు కావస్తున్నా ఆయన ఖమ్మంకు రాలేదు. ఓటమి తర్వాత నైరాశ్యంలో ఉన్న పార్టీకి నామ వైఖరి మరింత నైరాశ్యాన్ని తెచ్చిపెట్టింది. అభ్యర్థిగా ఎంపికైన తర్వాత జరిగిన సమావేశానికి కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జోష్ నింపిన ఆ జోష్‌ను అందిపుచ్చుకోవడంలో నామ పూర్తిగా వైఫల్యం చెందారు అన్నింటికి మించి బిఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న నామ పార్టీ మారతాడని విస్తృత ప్రచారం జరుగుతున్న ఆయన కానీ, ఆ పార్టీ కానీ ఖండించక పోవడం అనుమానాలకు తావిస్తుంది. ఆ పార్టీకి సంబంధించి ఎంపి రవిచంద్ర తప్ప మిగిలిన వారు అందుబాటులో లేరు. సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమాలకు హాజరవుతున్నారు. జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ కూడా ఎందుకో అంతగా స్పందించడం లేదు. నామ నాగేశ్వరరావు పార్టీ మారతారన్న అనుమానం పార్టీ నాయకత్వంలో కూడా ఉందా...? అందుకే ఆయనను అభ్యర్థిగా చూపుతూ కార్యక్రమాలను నిర్వహించడం లేదా అన్న అనుమానం పార్టీ క్యాడర్ మదిని తొలుస్తుంది. కారు ప్రచారమే శూన్యమైంది. ఎక్కడ ఎప్పుడు ఏ నాయకుడు గొంతు విప్పిన పరిస్థితి లేదు. అవకాశం దొరికితే కాంగ్రెస్‌లో చేరాలన్న యావ తప్ప మరొకటి బిఆర్ఎస్ నేతల్లో కనిపించడం లేదు. ఒకసారి ఓటమి చెందిన తర్వాత బిఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉందంటే రంకేలు వేసి తొడగొట్టిన వాళ్లంతా మాటుమయమయ్యారు. అధికారం కోసం కంతలు వెతుకులాడుకుంటున్నారు తప్ప ప్రజల ముందుకు రావడం లేదు. ఉద్యమ పార్టీలో పోరాట జావ చచ్చిపోయింది. బిఆర్ఎస్ పరిస్థితి ఈవిధంగా ఉంటే బిజెపిలో ఎవరికో టికెట్ దక్కుతుందనుకుంటే మరెవరికో దక్కింది. ఆ పార్టీ లీడర్లు, క్యాడర్లు కక్కలేక మింగలేక సతమతమవుతున్నారు. ఏమన్న మాట్లాడదామనుకుంటే సోకాల్డ్ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని లోలోన కుమిలిపోతున్నారు. పార్లమెంటు ఎన్నికల ముంగిట క్యాడర్‌లో నైరాశ్యం ఏ ఫలితాన్ని ఇస్తుందో వేచి చూడాలి.

## అడుగంటుతున్న భూగర్భజలాలు

(మొదటి పేజీ తరువాయి)

మొక్కజొన్న తదితర పంటలకు సాగునీరు అందక రైతులు హైరానా పడుతున్నారు. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు కురిసిన వర్షాలే తప్పా ఇప్పటి వరకు చుక్క నీరు పడలేదు. సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు అప్పట్లో చెరువులు, కుంటలు నిండి పొంగి పొర్లాయి. ఆ తరువాత నేటి వరకు వరణుడి కరుణ లేక చెరువులు, బావుల్లో నీరు కానరాక ఎండిపోయే దశకు చేరుకున్నాయి. అయితే రైతులు మాత్రం తాము సాగు చేస్తున్న పంటలను కాపాడుకునేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. బావిలో పేరుకపోయిన పూడితతీత పనులకు క్రేన్లు వాడుతున్నారు. క్రేన్ల సాయంతో పూడిక తీయించి కొంతలో కొంతైనా పంటను దక్కించుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు. అప్పుచేసి భూగర్బ జలాల జాడ కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అన్నదాతలకు అప్పు చేయాల్సినవసరం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పది మీటర్ల లోతుకు భూగర్భ జలాలు

జిల్లాలో పలు మండలాలలో పది మీటర్ల లోతుకు భూగర్జన జలాలు వెనక్కి వెళ్లాయి. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటడంతో బావులు, బోర్లలో నీరు పాతాళానికి చేరుకుంటున్నది. గతంలో వేసవి కాలంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా చెరువులలోకి నీరు నింపడంతో కొంత భూ గర్భ జలాలు పైకి చేరగా ప్రస్తుతం మార్చి నాటికే అడుగంటాయి. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. ఈ ఏడాది వర్షాలు వానాకాలంలో సగటు వర్షపాతానాకి చేరుకున్నా గడిచిన కొద్ది నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పంటలు చేతికి అందే సమయంలో భూగర్భ జలాలు అడుగంటి సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.

### పంటంతా పశువులకు మేత

ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట సాగునీరు లేక ఎండిపోతుంది. గతేడాది సెప్టెంబరులో అనుకున్నంత వర్షాలు పడక ఇప్పటికే చెరువులు, కుంటలు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. కాలువల ద్వారా సాగునీరు లేక సాగుకు కష్టమవుతుంది. దీంతో మండలాలలోని పలు గ్రామాల్లో రైతులు ఎండిన వరి పొలాల్లో పశువులను మేపుతున్నారు. ఎలాగో చేతికి వచ్చే అవకాశం లేదని కనీసం పశుగ్రాసంగానైనా ఉపయోగపడుతుందని పొలంలో పశువలకు మేత కోసం వదులుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎండిన వరి పంటను సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఎకరాకు రూ. 20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## దినసరి వేతనాలు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పెంచడంతో ఈ కూలీ రూ.300 లుకు పెరిగింది. తమిళనాడులో రూ.25లు పెంచడంతో రూ.319కి పెరిగింది. కర్ణాటక రాష్ట్రానికి పదీశాతం మేరకు పెంచారు. పశ్చిమ బెంగాల్‌లో రూ.13లుపెంచడంతో ఈ మొత్తం రూ. 250లుకు చేరుకుంది. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో అతి తక్కువగా రూ.7లు మాత్రమే పెంచారు. దీంతో ఈ రాష్ట్రాలలో వేతనం రూ.237లకు పెరిగింది. పశ్చిమ బెంగాల్‌లో కాగా సిక్కిం రాష్ట్రంలోని జ్ఞాతంగ్, లచుంగ్, లాఛెన్ మూడు గ్రామ పంచాయతీలలో కూడా దినసరి కూలీని రూ. 374లకు పెంచారు. బీహార్‌లో రూ.17లు పెంచారు. దీంతో ఈ వేతనం ఆ రాష్ట్రంలో రూ.228లకు పెరిగింది.అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలలో కనిష్టస్థాయిలో రూ.234లు మాత్రమే ఇస్తారు. ఈ మేరకే కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ గురువారంనాడు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందువల్ల ఈ నోటిఫికేషన్‌ను తొలుత కేంద్ర ప్రభుత్వం భారత ఎన్నికల సంఘానికి అందజేసింది. ఈనెల 27వ తేదీన ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన తర్వాతే ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ తెలియజేసింది. ఈ పథకం కింద 2023 నాటి వేతన రేట్లపై ఈ పెరుగుదల సంభవించింది. గ్రామీణ ప్రాంతాలలో దినసరి కూలీపై ఆధారపడి జీవితం సాగించే పేదలకు ఏడాదిలో కనీసం 100 రోజులుపాటు దినసరి వేతనాలు ఇచ్చేవిధంగా ఈ ఏర్పాటు చేసినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఎలాంటి నైపుణ్యం లేని రోజువారీ కూలీలకు ఈ పథకం కింద లబ్ధి కలుగుతుందని పేర్కొంది. ప్రస్తుత సవరణ ప్రకారం గోవాలో అత్యధికంగా రూ.34 లు పెంచడంతో ఈ దినసరి వేతనం రూ.356లకు చేరుకుంది. ఈ ఏడాది ఆరంభంలోనే ఈ వేతనాల సవరణ నివేదికను పార్లమెంటు ముందుంచారు. ఈ పథకం కింద వివిధ రాష్ట్రాలలో భారీస్థాయిలో వేతనాల్లో తేడాలు ఉన్నాయని సంబంధిత మంత్రిత్వశాఖ పేర్కొంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ వేతనాలు లేవని కూడా పేర్కొంది.



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే

### రూ.400 దినసరి కూలీ : రాహుల్ వెల్లడి

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకం కింద నైపుణ్యం లేని గ్రామీణ కూలీలకు రూ.400లు దినసరివేతనం ఇస్తామని ఆ పార్టీ పూర్వాధ్యక్షుడు, ఎం.పి రాహుల్‌గాంధీ భరోసా ఇచ్చారు. శ్రామిక్ న్యాయ్ గారంటీ కింద తమ ప్రభుత్వం రూ.400లు ఇసుతదని ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. ఈ పథకం కింద పెంచిన వేతనాలు చాలా అరకొరగా ఉన్నాయని ఆయన విమర్శించారు. రాహుల్‌గాంధీ ఈ మేరకు ఒక పోస్టింగ్ పెడుతూ, ''ఉపాధిహామీ పథకం దినసరి కార్మికులందరికీ అభినందనలు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మీ అందరికీ దినసరి వేతన ం ఏడు రూపాయలు పెంచారు బహుశా ఇప్పుడు ఆయన మిమ్మల్ని ఒక ప్రశ్న అడగవచ్చు. అంత పెద్ద మొత్తాన్ని మీరు ఏం చేసుకుంటారు? అని అడగవచ్చు రూ.700 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ఆయన బహుశా ఇప్పుడు మీ పేరు కూడా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటారు, 'థాంక్యూ మోడీ' అనేపేరుతో బహుశా ఆయన పార్టీ మీ తరపున ప్రచారం చేసుకుంటుంది'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. కాగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఇదే విషయంపై మరో పోస్టింగ్ పెడుతూ, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1న ఈ పథకం కింద వేతనాలు పెంచుతారన్నారు. ఈ వేతనాలన్నీ రూ.400 కంటే తక్కువగా ఉన్నాయని విమర్శించారు. తమ పార్టీ శ్రామిక న్యాయ్ గ్యారంటీ కింద రూ.400 దినసరి వేతనం పెంచుతుందని భరోసా ఇచ్చారు.

# పెళ్లి ఇంట్లో మరో విషాదం

మనుమడు పెళ్లి ఆగిపోయిందని మనస్తాపంతో

తాత ఆత్మహత్య

ఒకే గ్రామంలో నలుగురి అంత్యక్రియలు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఇంట్లో శుభకార్యం జరగవలసిన రోజున అన్యుహంగా అశుభం జరగడంతో పూర్తిగా బాచారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెళ్లి వేడుకల్లో భాగంగా బుధవారం పెళ్లికూతురు తీసుకురావడానికి వెళ్లిన బంధువులు, కులస్తులు ట్రాక్టర్‌లో బయలుదేరగా మార్గ మధ్యలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. 20 మంది గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనితో పెళ్లి కుమారుడైన రమేష్ తాత సొంగ పెంటయ్య (60) మనస్థాపానికి గురై గురువారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఆచారంలో చోటుచేసుకుంది. బాచారం గ్రామానికి చెందిన సొంగ రమేష్‌కు సంగారెడ్డి జిల్లా ఆందోల్ కు చెందిన పూజారి యాదయ్య కుమార్తెతో వివాహం కుదిరింది. వీరి పెళ్లి గురువారం పెళ్లి కుమారుడైన బాచారంలో వివాహం జరగవలసి ఉండేది. వివాహం కోసం వచ్చిన బంధువులు, కన్నీరు మున్నీరై అంత్యక్రియలో పాల్గొన్నారు. పెంటయ్యకు ఒక్కరే కుమార్తె ఉండడంతో గ్రామంలోనే అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు పెళ్లి కొడుకు రమేష్‌తో పాటు అతనికి తమ్ముడు ఉన్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

### ఒకే గ్రామంలో నలుగురి అంత్యక్రియలు

పెళ్లికూతురును తీసుకురావడానికి వెళ్లిన ట్రాక్టర్ బోల్త పడగా పెళ్లి కుమారుడి బంధువులు ఆగమ్మ 42, బూదెమ్మ 52, జిట్టిగారి సంగమ్మ 45 మృతిచెందగా మనవడి పెళ్లి ఆగిపోయిందని అతని తాత సోంగ పెంటయ్య 65 ఆత్మహత్య చేసుకోగా గురువారం సాయంత్రం బాచారంలో నలుగురి అంత్యక్రియలు నిర్వహించడంతో బాచారం గ్రామం మొత్తం శోకసాంద్రంలో మునిగిపోయింది. వీరి అంత్యక్రియలలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు పాల్గొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

అనుకుంటున్నానని కేశవ రావు వెల్లడించారు. పార్టీకి సంబంధించిన అంశాలపై బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌తో చర్చించానని,, పార్టీ అంతర్గత అంశాలపై కూడా చర్చించామని కేశవ రావు వివరించారు. కవిత అరెస్ట్ అంశం కూడా చర్చకొచ్చిందని, ఆమెను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. కెసిఆర్ తనకు చాలా గౌరవం ఇచ్చారని, తనకు కూడా కెసిఆర్‌పై గౌరవం ఉన్నదని, బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బాగా సహకరించారని తెలిపారు. 84 ఏళ్ల వయస్సులో తిరిగి కాంగ్రెస్ పార్టీకి వెళ్లాలని అనుకుంటున్నానన్నారు. కాగా ఈ నెల 30న కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు మేయర్ విజయలక్ష్మి వెల్లడించారు. అధికార పార్టీలో ఉంటేనే అభివృద్ధి పనులు అవుతాయని, ప్రజా సమస్యలు సులువుగా పరిష్కారం అవుతాయని మేయర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల కేశవ్ రావు,మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపా దాస్ మున్షీతో భేటీ అయిన విషయం తెలిసిందే. అయితే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తోపాటు పలువురు బిఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా కేశవరావు కుమారుడు విప్లవ్ కుమార్ బిఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.

**కెసిఆర్‌ను కలిసిన కేశవ్ రావు :** ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌తో కేశవ రావు గురువారం భేటీ అయ్యారు. అయితే కేశవరావు పార్టీని వీడడం పట్ల కెసిఆర్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలతో పాటు తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణమాలు, కవిత అరెస్ట్, జాతీయ రాజకీయాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా బిఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

## అభివృద్ధి చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని, అందుకు కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా పరిశ్రమలు, మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు భూసేకరణ తప్పనిసరి అని, భూసేకరణకు సహకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. అసైన్డ్ భూములు ఉన్న వాళ్లకు పట్టా భూములతో సమానంగా ఒకే ధర చెల్లించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తన నియోజకవర్గంలో ఎవరిని కూడా ఇబ్బందులకు గురిచేయడం ఇష్టంలేదని అన్నారు. అభివృద్ధికి సహకరించకపోతే మన ప్రాంతం ఎప్పటికి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంత పెద్ద నాయకుడినైనా కొడంగల్ కుటుంబ సభ్యుడినేనని, ఇక్కడి నుంచే రాజకీయాలు చేయాల్సిందేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ మెజారిటీతో వచ్చే లోక్‌సభ ఎన్నికలలో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఇవ్వాలని కోరారు. మండలం, బూత్, నియోజకవర్గస్థాయిల్లో ఐదుగురు సభ్యుల చొప్పున సమన్వయ కమిటీలను నియమించుకోవాలని సూచించారు.

**8న మళ్లీ కొడంగల్‌కు వస్తా :** ఏప్రిల్ 8వ తేదీన కొడంగల్‌కు వచ్చి ప్రతి మండల నాయకులకు ఒక్కొక్క గంట సేపు కేటాయించి నిర్ణయాలు తీసుకుంటానని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎట్టి పరిస్థితులలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. అదేవిధంగా ఏప్రిల్ 6వ తేదీన సాయంత్రం 5 గంటలకు తుక్కుగూడలో రాహుల్‌గాంధీ హజరయ్యే కాంగ్రెస్ బహిరంగ సభకు ప్రతి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి చల్లా వంశిచంద్‌రెడ్డి, తాండూర్ ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి, పరిగి ఎంఎల్‌ఏ రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి, ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్, నందారం ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, మురళీగౌడ్, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

హాజరుపరచాలని న్యాయమూర్తి బవేజా అధికారులకు ఆదేశించారు. ఆరు రోజుల కస్టడీ గురువారంతో ముగియడంతో ఇడి అధికారులు కేజ్రీవాల్‌ను కోర్టుకు హాజరుపరిచి తాజా ఉత్తర్వులు పొందారు. కేజ్రీవాల్‌ను ఎంతగా ప్రశ్నించినప్పటికీ ఆయన దాటవేసే పద్ధతిలో సమాధానాలు చెబుతున్నారు తప్ప అసలు ప్రశ్నలకు సూటిగా జవాబులు చెప్పడంలేదని కోర్టు ఎదుట ఇడి అధికారులు ఆరోపించారు. ఐతే ఈ కేసులో మరో ముగ్గురు సాక్ష్యులు చెల్లుబాటైన సమాచారం చెప్పారనీ, ఆ సమాచారాన్ని రికార్డు చేశామని కూడా అధికారులు కేసు పురోగతిని న్యాయమూర్తికి వివరించారు. అదేవిధంగా ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా వ్యక్తిగత కార్యదర్శి సి.అరవింద్‌తో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విచారణ సందర్భంగా వాగ్వాదం చేశారని కూడా కోర్టుకు ఇడి అధికారులు తెలియజేశారు. 2021–22 ఎక్సైజు విధానంపై మంత్రుల బృందం నివేదికను ఆనాడు కేజ్రీవాల్‌కు సి.అరవింద్ సమర్పించారని, ఈ విషయంపై ఆయన కస్టడీలో విచారణ సదర్భంగా ఆయనతో వాగ్వాదం చేశారని కోర్టుకు అధికారులు తెలియజేశారు. కాగా 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున పోటీ చేసిన ఒక అభ్యర్థి ఇచ్చిన నివేదికను కూడా కేజ్రీవాల్ కస్టడీలో ఉన్న సమయంలోనే తాము రికార్డు చేశామని కూడా ఇడి అధికారులు కోర్టుకు చెప్పారు. సదరు అభ్యర్థికి నిధులు ఏమీ ఇవ్వలేదనీ, ఎన్నికల ఖర్చు వ్యవహారాలన్నీ ఢిల్లీలోని ఆప్ కార్యాలయం ద్వారానే జరిగాయని ఆయన చెప్పారని కోర్టుకు అధికారులు తెలియజేశారు. కాగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సతీమణి మొబైల్ ఫోన్ లో ఉన్న డేటాను కూడా సేకరించామని, దానిని విశ్లేషిస్తున్నామని కూడా న్యాయమూర్తికి తెలియజేశారు. కేజ్రీవాల్ నివాసంలో ఈనెల 21వ తేదీన సోదాల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నాలుగు డిజిటల్ సాధనాలలో ఉన్న సమాచారాన్ని కూడా తాము ఇంకా విశ్లేషణ చేయవలసి ఉందని, ఇందుకు తమకు మరింత సమయం అవసరం అనీ, పాస్‌వర్డ్‌లు తెలుసుకోవలసి ఉందనీ, ఆయన తరపు న్యాయవాదులను సంప్రదించి పాస్‌వర్డ్‌లు తీసుకోవలసి ఉందని ఇడి అధికారులు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి తెలియజేశారు. పంజాబ్‌లో ఉన్న సీనియర్ అధికారులకు కూడా ఈ కేసులో సమన్లు జారీ చేసినట్లు చెప్పారు. ముడుపులు చెల్లించని వారి ఫ్యాక్టరీలను మూసివేయడమో లేదా పంజాబ్‌కు వ్యాపారుల హోల్‌సేలర్స్ సరుకును తరలించకుండా అడ్డుకోవడమో వంటి చర్యలకు పాల్పడ్డారని కూడా అధికారులు కోర్టులో ఆరోపించారు.

# పెద్దపల్లి పార్లమెంట్ గడ్డపై త్రిముఖ పోటీ

* కాంగ్రెస్ నుంచి కాకా వారసుడికి అవకాశం
* బిఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల
* బిజెపి ఎంపి అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్

**ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు**

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ గడ్డపై త్రిముఖ పోటీ నెలకొంది. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలో ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్న క్రమంలో పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలపై దృష్టిసారించారు. పెద్దపల్లి పార్లమెంట్ రిజర్వ్‌డ్ స్థానంలో ఎక్కువ సార్లు మాజీ కేంద్ర మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి ఎన్నిక కావడం, ఆ తర్వాత ఆయన కుమారుడు గడ్డం వివేక్ ఎన్నికయ్యారు. ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం కాకా వారసుడు గడ్డం వంశీని ఎంపి అభ్యర్థిగా ప్రకటించింది. అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి, ధర్మపురి మాజీ ఎంఎల్ఏ కొప్పుల ఈశ్వర్‌ను ఎంపి అభ్యర్థిగా ప్రకటించగా, బిజెపి నుంచి గోమాస శ్రీనివాస్‌ను బరిలో నిలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల నుంచి మరికొంత మంది, స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచినా ఈ మూడు పార్టీల అభ్యర్థుల మధ్య గట్ట పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించింది. ఈసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, ఎన్నికల్లో తమ సత్తా చాటాలనే ప్రకడ్బందీ వ్యూహంలో బిఆర్ఎస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్టీలతో పాటు గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం ఇక్కడ పాగా వేయాలని ఆచి తూచి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాకా వారసుడిగా గడ్డం వంశీకి, ఎంఎల్ఏగా పోటీ చేసి ఓటమికి గురైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సానుభూతి అనుకూలంగా మారుతుందా అని విశ్లేషకులు చర్చిస్తున్నారు. అదే విధంగా ఈసారి పెద్దపల్లి ఎంపిగా బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు ప్రజలు అవకాశం ఇస్తారా అని విశ్లేషిస్తున్నారు.

**పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నం**

గతంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన గడ్డం వెంకటస్వామి ఓటమి ఎరుగని నేతగా మూడుసార్లు ఎంపిగా విజయం సాధించారు. ఈ క్రమంలో ఆనాడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో



మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. అటు తర్వాత ఆయన వారసుడిగా గడ్డం వివేక్ పెద్దపల్లి ఎంపిగా బరిలో నిలిచి విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి పెద్దపల్లి పార్లమెంట్‌లో పూర్వవైభవం తీసుకువచ్చారు. అలా అత్యధిక ఏళ్లు కాకా కుటుంబ సభ్యులే ఎంపిలుగా ఉన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పట్టు కోల్పోయింది. ఒకసారి చెన్నూరు మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్, మరోమారు వెంకటేష్ నేత ఎంపిగా విజయం సాధించి పెద్దపల్లి పార్లమెంట్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేశారు. అయితే ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ ఆ పార్టీ కాకా వారసుడిగా యువ నాయకుడు గడ్డం వంశీని ఎంపి అభ్యర్థిగా ప్రకటించి పూర్వ వైభవంతో కోసం కాంగ్రెస్ కృషి చేస్తోంది.

**పట్టును కాపాడుకునేందుకు బిఆర్ఎస్ అడుగులు**

కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్‌ను తమ ఖాతాలో వేసుకున్న బిఆర్ఎస్ ఈసారి కూడా వదులుకోబోమనే ధీమాను వ్యక్తం చేస్తోంది. పెద్దపల్లి పార్లమెంట్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తన గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ధర్మపురి ఎంఎల్ఏగా, జిల్లా మంత్రిగా పనిచేసిన ఆయన పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మంచి పట్టు సాధించారు. నాలుగుసార్లు ఎంఎల్ఏగా విజయం సాధించిన ఆయన మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు. ఎంఎల్ఏగా ఓటమికి గురైన కొప్పులకు ప్రజల నుంచి సానుభూతి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కొప్పుల ఈశ్వర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు, ప్రచారాలు చేపట్టారు.



**పెద్దపల్లి పార్లమెంట్‌పై బిజెపి కన్ను**

పెద్దపల్లి బిజెపి ఎంపి అభ్యర్థి అయిన ప్రముఖ వ్యాపార వేత్త గోమాస శ్రీనివాస్‌కు ఈ ప్రాంతంలో మంచి పట్టు ఉన్నట్లు బిజెపి నాయకులు చెబుతున్నారు. పారిశ్రామికవేత్తగా ఈ ప్రాంత ప్రజలతో మమేకమైన శ్రీనివాస్ గతం లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపిగా బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఆ పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఈసారి బిజెపి నుంచి టికెట్ దక్కించుకున్న శ్రీనివాస్ పెద్దపల్లిలో బిజెపి జెండాను ఎగురవేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రాజకీయంగా, వ్యాపార పరంగా ఉన్న పరిచయాలతో గెలుపు కోసం తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బిజెపి అధిష్టానం సైతం ఎట్టిపరిస్థితుల్లోనూ పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని వదులుకోవద్దని, పెద్దపల్లి పాగా వేయాలని ప్రత్యేక దృష్టిపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.



## ఇంటర్ కాలేజీలకు మే 31వరకు సెలవులు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు సెలవులు ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు సెలవులు కొనసాగనున్నాయి. మళ్లీ జూన్ 1వ తేదీన కాలేజీలు తెరుచుకోనున్నాయి. ఈ సెలవులు రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కాలేజీలకు వర్తించ నున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాలను ఉల్లంఘించి కాలేజీ లను నిర్వహించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు ఒక ప్రకటనలో హెచ్చరించింది. వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అడ్మిషన్లు తీసుకోవాలని, ఆ తేదీలను ప్రకటించినప్పుడే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని సూచించింది.

## ఏ రాజకీయ పార్టీ ఉండొద్దని మోడీ కుట్ర

### బిఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ విమర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఏ రాజకీయ పార్టీ ఉండకూడదని మోడీ కుట్ర పన్నుతున్నారని బిఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ విమర్శించారు. అన్ని రాష్ట్రాల్లో ఇడి, ఐటి, సిబిఐతో దాడులు చేయిస్తూ, మోడీ పదేళ్ల పాలనపై చర్చ లేకుండా చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం ఏమీ చేయలేదన్న అంశం లోక్ సభ ఎన్నికలలో చర్చ జరగకుండా, ఆ ఏజెండానే లేకుండా బిజెపి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతలందరూ ఎన్నికల ప్రచారం చేయకుండా ఇడి కార్యాలయాల చుట్టూ తిరగాలా?అని నిలదీశారు. సిఎం కేజ్రీవాల్, ఎంఎల్‌సి కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని, కేరళ సిఎం కుమార్తెపై ఇడి కేసు నమోదు చేశారని, ఆర్‌జెడి, శివసేన, డిఎంకె, టిఎంసి, సమాజ్ వాదీ నేతలకు నోటీసులు జారీ చేస్తున్నారని, వీరంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలా?, లేదా మోడీ విచారణలో పాల్గొనాలా అని ఎద్దేవా చేశారు. దేశంలో ఎన్నికలను ఇసి నిర్వహించడం లేదని, ఇడి నిర్వహిస్తోందని వ్యాఖ్యానించారు. బిజెపికి లొంగి, ఆ పార్టీలో చేరితే ఎటువంటి అరెస్టులు ఉండడం లేదని, లొంగకుండా పోరాటం చేస్తున్నవారిపై వేధింపులు, దాడులు, పలు కేసులు పెడుతున్నారని విమర్శించారు. 400 సీట్లు గెలుస్తామనే ధైర్యం ఉంటే, మోడీ ఇలా ఎందుకు చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ లేదని చెబుతున్న కిషన్ రెడ్డి తమ పార్టీకి చెందిన నేతలకు ఎందుకు ఎంపి టికెట్లు ఇస్తున్నారని ప్రశ్నించారు.

## బాండ్ల నగదు చెల్లింపులో జాప్యమెందుకు?

### ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అప్పారావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్‌టిసి యాజమాన్యం కార్మికుల పట్ల వివక్ష పూరిత ధోరణి అవలంభిస్తుందని బాండ్లకు సంబంధించిన నగదు చెల్లింపులో ఎందుకు జాప్యం జరుగుతుందని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బాండ్ల చెల్లింపుకు సంబంధించి రూ.281కోట్లను విడుదల చేసి 40రోజులు గడుస్తున్నా కార్మికులకు నగదు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అత్యవసర సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాటి అప్పారావు మాట్లాడుతూ బాండ్ల చెల్లింపు విషయంలో ప్రభుత్వ వైఖరికి భిన్నంగా ఆర్‌టిసి యాజమాన్య వైఖరి ఉందని కొంత భాగాన్ని సీనియార్టి ప్రకారం చెల్లిస్తామని చెప్పినా ఒక్క పైసా కూడా చెల్లించలేదన్నారు. ఎందుకు చెల్లించడం లేదో యాజమాన్యం కార్మికులకు తెలియజేప్పాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.



కార్మికుల మనోభావాలతో యాజమాన్యం ఆటలాడుతుందని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అప్పారావు పిలుపునిచ్చారు. యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు డి. జగన్నాథం, బి.బుచ్చిబాబు, ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు గోపాలరావు, నాగులమీరా, రఘురాం, రాంబాబు, ఆర్. నాగేంద్రసింగ్, కె. నాగభూషణ రావు, రాయప్ప, సుందరం, రమణారావు, మధు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కాలం తెచ్చింది కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** కాలంతెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండ లం సారంపల్లి గ్రామంలో ఇటీవల వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న కరువు కాలం తెచ్చింది కాదని కాంగ్రెస్ పార్టీ తెచ్చిందని తీవ్రంగా విమర్శించారు. రైతులకు అడగకముందే రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మరోవైపు బ్యాంకు అధికారులు రైతులను తీవ్రంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితులను తెలుసుకునేందుకు బిఆర్ఎస్ పార్టీ రైతుల వద్దకు వెళుతుందని తెలిపారు. గతంలో ఇదే సంవత్సరం కాళేశ్వరం నీటితో రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రైతుల రుణాలు మాఫీ చేయడంతో పాటు కాళేశ్వరం మేడిగడ్డ వద్ద కాపర్ డ్యాం నిర్మించి నీటిని తరలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంగళ్ళపల్లి ఎంపీపీ పడగల మానస, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడూరు ప్రవీణ్, మాట్ల మధు, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## బిజెపికి రూ.419 కోట్ల చందాలు

### తెలంగాణ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ సుజాత పాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ బోగస్ కంపెనీల నుండి బిజెపికి రూ.419 కోట్ల చందాలు వచ్చాయని ఎఐసిసి అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ సుజాత పాల్ తెలిపారు. చందాలు ఇవ్వండి ,దందాలు చేసుకోండి అనే తరహాలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల బండ్‌లను కొనుగోలు చేయించిందని విమర్శించారు. హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుజాత పాల్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, అందుకే బిజెపి అనేక కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా కుంగతిసేందుకు ఆదాయ పన్ను కట్టలేదని పార్టీకి చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడి,ఐటి, సిబిఐలను దుర్వినియోగం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపిలు రూ.14 లక్షల నగదు చందాలు ఇచ్చినందుకు 106 శాతం జరిమానా విధించారన్నారు. బిజెపి మాత్రం ఇడి,ఐటి సోదాలు నిర్వహించి, చందాలను వసూలు చేశారని, 38 గ్రూప్‌లకు 179 ప్రాజెక్టులను కట్టబెట్టారన్నారు. రూ.2004 కోట్లు ఆయా కంపెనీల నుంచి చందాలు వసూలు చేశారని, ఇందుకు గాను రూ.3,84, 800 కోట్ల కాంట్రాక్టులను కట్టబెట్టారని ఆరోపించారు.

## రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యం

### కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని, ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి పాటుపడాలని, కష్టపడ్డ ప్రతి ఒక్కరు పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ములుగు మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిధిగా సీతక్క హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు అటవీ హక్కు చట్టం ఆహార భద్రత, ఉపాధిహామీ సమాచార హక్కు, విద్యా హక్కు, చట్టాలు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, పేదలకు ఏడు విడతలుగా భూ పంపిణీ చేశామని,



ఇప్పుడు ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి వారి అప్పులు మాఫీ చేసిందని ప్రతి ఒక్క కుటుంబంలో రూ.15లక్షలు వేస్తామని మోసం చేసిన నీచమైన చరిత్ర బిజెపి పార్టీ మోడీ ప్రభుత్వానిదని, ఉద్యోగాలు కల్పించకుండా పెట్రోల్, డిజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిన బిజెపికి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని 100 ఏనుగుల తిన్న రాబందు ఒక్క గాలి వానతో కుప్పకూలినట్లు 10 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్ ప్రజలు ఇచ్చిన తీర్పుతో బిఆర్ఎస్ నాయకులు మా ప్రభుత్వంపై ఇష్టమున్నట్లు మాట్లాడడం సిగ్గుచేటని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మన ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, ములుగు, మండల క్లస్టర్, ఇన్‌చార్జిలు గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## నిలిచిన అత్యవసర డిప్యుటేషన్లు

* వైద్య ఆరోగ్యశాఖ నుండి వివరాలు అడిగిన కలెక్టర్
* నిరాశ చెందుతున్న దళారులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** "వైద్య ఆరోగ్యశాఖలో మళ్లీ డిప్యుటేషన్ల దందా! "అంటూ ఈ నెల 23న "ప్రజాపక్షం" దినపత్రికలో ప్రచురితమైన కథానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. అత్యవసరాల పేరిట డిప్యుటేషన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీంతో ఆశా వాహుల్లో నిరాశ ఎదురైంది. వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లను రద్దు చేస్తూ గత నెల 7న ఆశాఖ కార్యదర్శి క్రిష్టిన జడ్ ఛోంగ్తో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎవరి స్థానాలకు వారు వెళ్లి విధుల్లో చేరారు. కాగా ఆ ఉత్తర్వుల్లో అత్యవసరమైతే కలెక్టర్ల ఆమోదంతో డిఎంహెచ్ఓలు డిప్యుటేషన్లు ఇవ్వొచ్చు అంటూ పేర్కొన్నారు. ఇక్కడే ఇప్పుడు అసలు కథ మొదలైంది. ఉత్తర్వుల ప్రకారం రిలీవ్ అయిన 85 మందిలో సుమారు 40 మందికి పైగా వెంటనే పలు రకాల సాకులతో మళ్లీ అత్యవసరం అంటూ దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఫైల్ కలెక్టర్ వద్దకు చేరింది. అయితే ఈ లోగా ప్రజాపక్షంలో కథనం రావడంతో కలెక్టర్ ఆలోచనలో పడి తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

**కలెక్టర్ ఆరా:** అత్యవసరం పేరిట కలెక్టర్‌కు చేరిన జాబితాపై ఆరా తీస్తున్నారు. గతంలో రిలీవ్ అయిన వారు ఎవరెవరూ, ఎక్కడెక్కడి నుండి ఎక్కడెక్కడ విధులు నిర్వహించారు. వారి రిలీవ్ అయి ఎంత కాలం అయ్యింది. తిరిగి అత్యవసర డిప్యుటేషన్ కోసం దరఖాస్తులు చేసుకుంది ఎంతమంది. వారిలో ప్రస్తుతం రిలీవైన వారు ఎందరుకున్నారు అనే దానిపై కలెక్టర్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రిలీవ్ లిస్టుతో పాటు ప్రస్తుత దరఖాస్తు లిస్టును క్రాస్ చెక్ చేయాలని సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో వారం రోజుల్లోగా నివేదిక రూపంలో సమర్పించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించినట్లు సమాచారం.

**దళారుల్లో నిరాశ:** వైద్య ఆరోగ్యశాఖలో అత్యవకర డిప్యుటేషన్లను కలెక్టర్ తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో దళారుల గొంతులో వెలగపండు పడినట్లు అయ్యింది. కోరుకున్న చోటికి డిప్యుటేషన్ చేయిస్తామని, అధికారులు మాకు బాగా తెలుసునని నమ్మబలికి ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క రేటు కట్టి వసూళ్లు చేసినట్లు తెలిసింది.

ఇప్పుడు డిప్యుటేషన్ల ప్రక్రియ నిలుపుదల కావడంతో వారు అయోమయ స్థితిలో పడ్డారు. డబ్బులు ఇచ్చిన వారు తమ సొమ్ముల్లు వెనక్కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా కొందరితో ఒప్పందాలు అయ్యాయని, నోటికాడి కూడా పోయిందని దళారులు నిరాశ చెందుతున్నట్లు తెలుస్తోంది.

## నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలి

### జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో డాక్టర్ శశాంక్ గోయెల్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఎప్పటికప్పుడు మారుతున్న మీడియా స్థితిలో, శిక్షణ అనేది ఒక్కసారి మాత్రమే నిర్వహించే విషయం కాదని, మీడియా నిపుణులు తమ కెరీర్‌లో వివిధ దశలలో శిక్షణా కార్యక్రమాలకు హాజరవడం ద్వారా వారి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయెల్ అన్నారు. మీడియా నిపుణులు తమ ప్రధాన విలువలైన నిజాయితీ, సమగ్రత మరియు జవాబుదారీతనానికి కట్టుబడి ఉండాలని, సమాజంలోని వివిధ వర్గాలకు, ముఖ్యంగా బలహీనులు, వెనుకబడిన వారికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. వియత్నాం నుండి మీడియా నిపుణుల కోసం జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ రెండు వారాల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. శిక్షణార్థులు మార్చి 29, 30 తేదీలలో ఢిల్లీ, ఆగ్రాలను సందర్శించి, 2024, మార్చి 31న వియత్నాంకు బయలుదేరుతారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఐటిఇసి ప్రోగ్రాం కింద భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేయగా, తెలంగాణ ప్రభుత్వంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహించింది.



ముగింపు సమావేశంలో డాక్టర్ శశాంక్ గోయెల్ మాట్లాడుతూ వేగవంతమైన సాంకేతిక పురోగతి, అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ వ్యవస్థలతో కూడిన యుగంలో, మీడియా నిపుణులు సత్యాన్ని అనుసరించడంలో, ఖచ్చితమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడం, తద్వారా ప్రజాస్వామ్య పునాదులు, ప్రపంచ అవగాహన ను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. భారతదేశంలో వైవిధ్యమైన, క్రియాశీలక ప్రింట్ మీడియా వ్యవస్థలో భారీ సాంకేతిక పురోగతి సాధించిన డిజిటల్ మీడియా, ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట ర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ శశాంక్ గోయెల్ అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా నుండి సీనియర్ జర్నలిస్టులు, విద్యావేత్తలు, విషయ నిపుణులు, వియత్నాం నుండి వచ్చిన మీడియా నిపుణులతో వారి నైపుణ్యం, దృక్కోణం, ఉత్తమ అభ్యాసాలను పంచు కున్నారన్నారు. ఈ కార్యక్రమం వియత్నాంలోని మీడియా నిపుణులను తమ దేశంలోని మీడియా పరిశ్రమకు అర్థవంతమైన సహకారం అందించడానికి సన్నద్ధం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. శిక్షణా కార్యక్రమం భారత్, వియత్నాం మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ గోయెల్ కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజల ముంగిట్లోకి జాతీయ మేనిఫెస్టో’ చైర్మన్‌గా దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్ర, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ‘ప్రజల ముంగిట్లోకి జాతీయ మేనిఫెస్టో’ కమిటీని టిపిసిసి నియమించింది.



త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో జాతీయ మ్యానిఫెస్టోను రాష్ట్రవ్యాప్తంగా అందరికీ చేరేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ పదిహేను రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిటీ సభ్యులుగా పిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, పిసిసి మేధావుల సెల్ చైర్మన్ ఎ.శ్యామ్ మోహన్, మాజీ ఎంఎల్‌సి బి.కమలాకర్ రావు, పిసిసి ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బి.ఎం.వినోద్ కుమార్, పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ మహ్మద్ రియాజ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బి.జనక్ ప్రసాద్‌లను నియమించారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నాడు టిపిసిసి ఉపాధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ కమిటీ నియమిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఖమ్మంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర మహాసభలు

### హాజరుకానున్న సిఎం, పలువురు రాష్ట్ర మంత్రులు

**ప్రజాపక్షం/ఖమ్మం:** టియుడబ్ల్యుజె(ఐజెయు) మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మే నెల చివరి వారంలో ఖమ్మంలో జరగనున్నట్లు టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ వర్గాల ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. టియుడబ్ల్యా జె (ఐజెయు) రాష్ట్ర మహాసభల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక సమావేశం గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.





జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ మహాసభల నిర్వహణకు సంబంధించి ఖమ్మంజిల్లాకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహాసభలు నిర్వహించడం ఖమ్మంలో ఇది మూడోసారి అని గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రెండు సార్లు మహాసభలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభల నిర్వహణను పురస్కరించుకుని ఏప్రిల్ మొదటి వారంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నామని దీనికి రాష్ట్ర కమిటీ బాధ్యులు హాజరవుతారని తెలిపారు. మహాసభలలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం చర్చించడం జరుగుతుందని రాంనారాయణ తెలిపారు.

ఖమ్మంజిల్లా ఎన్నో ప్రజా ఉద్యమాలతో పాటు చారిత్రిక మహాసభలకు అతిథ్యమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు, జర్నలిస్టులు పూర్తి సహయ సహకారాలను అందించి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కమిటీ బాధ్యులు ఎన్. వెంకట్రావు, ఖదీర్, టియుడబ్ల్యుజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నాయకులు నలజాల వెంకట్రావు, శివానంద, ఎం. పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, కూరాకుల గోపి, వై. మాధవరావు, ఎస్‌కె మోహినుద్దీన్, తాళ్లూరి మురళి, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, మేడి రమేష్, భవా ని సింగ్, ఆలస్యం అప్పారావు, ఏలూరి వేణుగోపాల్, కళ్యాణ్, రవికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు చట్టాన్ని అతిక్రమిస్తే టిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసింది?

### బిజెపి ఎంపి డాక్టర్ కె.లక్ష్మ ణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసులేమో నేతలు చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతున్నారు, మరో వైపు కెటిఆర్ మాత్రం ఒక్కరిద్దరి ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని మాట్లాడుతున్నారని, పోలీసులు చట్టాన్ని అతిక్రమిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని బిజెపి ఎంపి డాక్టర్ కె.లక్ష్మ ణ్ నిలదీశారు. ఇప్పటికైనా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరపడం లేదన్నారు.

డ్రగ్స్, మియాపూర్ భూ కుంభకోణం, ధరణిలో అక్రమాలు, కొత్తగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెర మీదకు వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి స్కీమ్‌ను స్కామ్‌గా మార్చేశారని, కమీషన్లు దండుకున్నారని ఆరోపించాఉ. ప్రశ్నించే వారిని బెదిరింపులకు గురి చేశారని, నియంతృత్వ పోకడలను సాగించారని, కక్ష సాధింపులో భాగంగానే ప్రతిపక్ష పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని లక్ష్మ ణ్ విమర్శించారు. గతంలో జరిగిన పలు ఉప ఎన్నికల సమయంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించిందని, ఇది తీవ్రమైన నేరమని లక్ష్మ ణ్ తెలిపారు.

ప్రజాపక్షం

శుక్రవారం, మార్చి 29

# భయపెడుతున్న నిరుద్యోగం

దేశంలో నిరుద్యోగ సమస్య గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థను భయపెడుతున్నది. సవాళ్లు విసురుతున్నది. మానవాభివృద్ధి సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనం మన దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతను కళ్లకు కడుతున్నది. ఈ నివేదిక ప్రకారం, వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య క్రమంగా వ్యవసాయేతర రంగాలవైపు మళ్లింది. 2000 దశకాల్లో, మొత్తం దేశ ఉపాధిలో 60 శాతం వ్యవసాయ రంగమే కల్పించగా, 2019 నాటికి అది 42 శాతానికి పడిపోయింది. ఇటీవల కాలంలో వ్యవసాయ రంగ ఉపాధిలో క్షీణత గణనీయంగా పెరగడాన్ని కూడా ఈ అధ్యయనం గుర్తించింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అత్యంత పేలవంగా ఉన్నాయన్నది వాస్తవం. ఉపాధి దొరికిన వారికి సరైన వేతనాలు లేవు. ఉద్యోగ భద్రత లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెరుగుతున్నారు. వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం కొనసాగుతున్నది. ప్రపంచంలోనే అత్యధిక శాతం యువత ఉన్న దేశం మనది. అత్యధిక నిరుద్యోగం కూడా ఇక్కడే. కరోనా మహమ్మారి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను తల్లకిందులు చేసింది. అయితే, చాలా దేశాలు క్రమంగా కోలుకోగా, మన దేశం మాత్రం సమస్యల నుంచి బయటపడలేకపోతున్నది. ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలు, సంస్థల లాభాపేక్ష ముందు ఉద్యోగుల సంక్షేమం, భద్రతల ఉనికే లేకుండాపోతున్నది. గత్యంతరం లేని పరిస్థితుల్లో, యువత ఏదో ఒక పనిని కల్పించుకోవడంతో, అనధికార ఉపాధి పెరిగింది. అధికారిక రంగంలో సగానికిపైగా ఉద్యోగాల్లో ఇలాంటి అనధికారిక స్వభావాలు మిళితమయ్యాయి. ఉపాధి, జీతంలేని కుటుంబ పని కూడా పెరిగింది. మహిళల శ్రామిక శక్తిలో 82 శాతం ఇలాంటి అనధికారిక రంగంలోనే నిమగ్నమయ్యారని ఐఎల్ఓ నివేదిక వెల్లడించింది. స్వయం ఉపాధి 2000 నుంచి 2019 వరకూ 52 శాతంగా, స్థిరంగా కొనసాగింది. ఆ తర్వాత వేగంగా పెరిగి, 2022 నాటికి 55.8 శాతానికి చేరింది. ఒకప్పుడు నిరుద్యోగుల్లో అత్యధిక శాతం మంది నిరక్షరాస్యులుకాగా, ప్రస్తుతం అక్షరాస్యులు, ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగులే అధికంగా ఉన్నారు. నిరుద్యోగితా రేటు రోజురోజుకూ పెరగడం ఆందోళన కలిగించే అంశం. విద్యావంతులైన యువకుల్లో నిరుద్యోగం రేటు 2000లో 23.9 శాతం నుంచి 2019 నాటికి 30 శాతానికి చేరింది. చదువుకు, చేస్తున్న పనులకు మధ్య పొంతన లేదు. వృత్తి నైపుణ్యం లేక, ఉపాధి అవకాశాలు లభించక, అసంఘటిత రంగాల్లో పనులు చేసుకునే వారి సంఖ్య ఏటేటా రెట్టింపు అవుతున్నది. పని నాణ్యత లేని కారణంగా ఉపాధి కల్పన కష్టమవుతున్నదని యాజమాన్యాల వాదన. అసలు పనే దొరకనప్పుడు, అనుభవం, నైపుణ్యం ఎలా సాధ్యమన్నది సగటు నిరుద్యోగి ఆవేదన. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ద్వారా ఈ విషవలయాన్ని ఛేదించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పించుకోవడం నిరుద్యోగుల పాలిట శాపమవుతున్నది. మితిమీరిన యాంత్రికీకరణ ఒకవైపు, కొత్తగా పుట్టుకొచ్చిన కృత్రిమ మేధ మరోవైపు ఉద్యోగావకాశాలను కుదించివేస్తున్నాయి. దీనికితోడు ప్రైవేటు సంస్థల లాభాపేక్ష శ్రమ దోపిడీని ప్రోత్సహిస్తున్నది. దేశంలోని యువ శక్తిని, శ్రామిక బలాన్ని ఉపయోగించుకోలేకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే. కార్మిక హక్కులను కాలరాసి, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని బుట్టదాఖలు చేసి, కాంట్రాక్టు విధానాన్ని ప్రోత్సహించి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నది. శ్రమకు విలువ లేకుండా చేస్తున్నది. ఉపాధి కల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయనంత కాలం నిరుద్యోగ సమస్యకు తెరపడదు. శ్రమ దోపిడీ అంతం కాదు.

# వ్యవస్థలమీద సన్నగిల్లుతున్న విశ్వాసం – స్వయంకృతం



ఎం. కోటేశ్వరరావు

ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొరేట్ల కంపెనీల నుంచి విరాళాలను తీసుకోవటం అక్రమం అని ఆ పథకం ప్రారంభం నుంచి అనేకమంది చెబుతున్నా గుడ్డిగా గొర్రె కసాయివాడిని నమ్మినట్లు చాలామంది అదొక మంచి సంస్కరణ అని మద్దతు ఇచ్చారు. సుప్రీంకోర్టు 2024, ఫిబ్రవరి 15న ఇచ్చిన తీర్పుతో కొందరు స్వంత బుర్రలతో ఆలోచించటం మొదలు పెట్టారు. మరికొందరు మరక మంచిదే అన్నట్లుగా బాండ్ల ను తీసుకున్న పార్టీలను సమర్ధిస్తున్నారు. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పుతో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరిగింది. ఇది మరొక భ్రమకు దారితీస్తుందా? మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ ఢిల్లీ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మీద దర్యాప్తు సంస్థలు సమర్పించిన తప్పుడు వివరాల ప్రాతిపదికన దిగువ కోర్టు యావజ్జీవ శిక్ష విధిస్తే పదేళ్ల తర్వాత హైకోర్టు దాన్ని కొట్టివేసింది. పదేండ్ల పాటు వేధింపులకు, జైలుపాలై, ఉద్యోగం పోగొట్టుకున్న ఉదంతం చూసిన తరువాత ఎవరికైనా ఏమనిపిస్తుంది? వ్యవస్థల మీద విశ్వాసం పెరుగుతుందా, తగ్గుతుందా !

పదేండ్ల క్రితం లోక్‌సభ ఎన్నికలకు ముందు దేశాన్ని ఊపివేసిన, బిజెపికి ఓట్లు, అంతకంటే ఎక్కువ సీట్లు రాల్చిన కేసుల్లో 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం ఒకటి. దీని గురించి ఎంతమందికి జ్ఞాపకం ఉండి ఉంటుంది? మరోసారి 2024, మార్చి 22న ఢిల్లీ హైకోర్టు దీని గురించి జనానికి గుర్తు చేసింది. అదేమంటే 2017, డిసెంబరు 21 ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టివేసిన ప్రత్యేక కోర్టు తీర్పును తిరిగి విచారించాలని 2018, మార్చి 20వ తేదీన సిబిఐ దాఖలు చేసిన పిటీషన్‌కు అనుకూలంగా ఆరు సంవత్సరాల తరువాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. సదరు తీర్పులో పరస్పర వైరుధ్యాలు కనిపించాయని, దానిమీద అప్పీలు చేయాలా లేదా అనేది సిబిఐ ఇష్టమని చెప్పింది. దీన్నే మరోవిధంగా చెప్పాలంటే అనుమతించింది. ఒక తీర్పుమీద చేసిన అప్పీలును పరిష్కరించటానికి ఇన్ని సంవత్సరాలు తీసుకున్న న్యాయవ్యవస్థ మీద, అందునా ఏడుగురు న్యాయమూర్తులు విచారించిన తరువాత సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇచ్చిన తీర్పు మీద జనాలకు ఎలాంటి అభిప్రాయం కలుగుతుంది? ఎన్నికల బాండ్లమీద స్పందించిన తీరుకు సంతోషించాలా? 2జి కేసులో చేసిందాన్ని మరొక విధంగా భావించాలా? యుపిఎ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న డిఎంకె నేత రాజా, అదే పార్టీ ఎంపిగా ఉన్న కనిమొళి, మరో 16మంది అధికారులు, ఇతరులు 2జి కేసులో నిర్దోషులని 2017 తీర్పులో కోర్టు పేర్కొని వారిని విడుదల చేసింది. అనుచిత పద్దతుల్లో అయిన వారికి వీలుగా అనుసరించిన పద్దతి కారణంగా లక్షా 76వేల కోట్ల రూపాయలు దేశ ఖజానా నష్టపోయిందన్నది కేసులో వచ్చిన తీవ్ర ఆరోపణ. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆమ్ ఆద్మీ సర్కార్ లైసెన్సుదారులకు రు.30కోట్ల మేర రాయితీలు అనుచితంగా ఇచ్చిందని, ప్రయివేటు మద్యం వ్యాపారులు దుకాణాలను దక్కించుకొనేందుకు అనువుగా విధానాన్ని రూపొందించినందుకు లబ్ది పొందిన వారు వంద కోట్ల రూపాయల ముడుపులు అందచేసినట్లు ఆరోపణలు చేశారు.

అవినీతి ఎంతఅయినా అందుకు పాల్పడిన వారిని వదల కూడదు. వంద కోట్లు నిగ్గుతేల్చటంలో రెండు సంవత్సరాలుగా సిబిఐ, ఇడి కూడా విఫలమైంది. కొందరిని అనుమానితులు, సాక్షులు, నిందితులు అంటూ అరెస్టుచేసి వివరాలు చెప్పాలని వారిని అడుగుతున్నది, నిందితులను నిరవధికంగా బెయిలు రాకుండా జైలుపాలు చేసింది. తాము నిధులు ఇచ్చామంటూ అప్రూవర్లుగా మారిన కొందరు చెప్పటం తప్ప ఆ సొమ్ము ఎవరి ఖాతాకు, ఎలా చేరిందన్నది ఇంతవరకు తెలియదు. బిఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితను ముందు సాక్షి అన్నారు, తరువాత నిందితురాలిగా ప్రకటించిన తరువాత అరెస్టు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తమ ముందుకు హాజరుకావాలని ఇడి తొమ్మిది సార్లు నోటీసులు ఇచ్చింది. తాను ఏ హోదాలో రావాలో చెప్పమని అడిగితే అదేం కుదరదు మేం రమ్మన్నాం గనుక రావాల్సిందే అన్నట్లుగా వ్యవహరించింది. దాంతో తనను బలవంతం చేస్తున్నారని, రక్షణ కల్పించాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. ఆ సందర్భంగా వ్యక్తిగత హోదాలో విచారణకు రావాలని, వచ్చిన తరువాత అరెస్టు చేస్తామని గాని లేదని గానీ తాము చెప్పటం లేదని ఇడి కోర్టులో వాదించింది. కోర్టు కేజ్రీవాల్ కోరినట్లుగా రక్షణ కల్పించేందుకు తిరస్కరించింది. వెంటనే ఇడి అధికారులు కేజ్రీవాల్ ఇంటికి పోవటం సోదా తతంగం, అరెస్టు అంతా నాటకీయంగా జరిగింది. కవిత, కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారా లేదా అనే సంగతి కాసేపు పక్కన పెడదాం. రెండు సంవత్సరాల నుంచి జరుగుతున్న హడావుడి తరువాత ఒకవేళ అవినీతి జరిగి ఉంటే దానికి సంబంధించిన ఆధారాలను వారు ఇండ్లలో భద్రపరచి ఇడి అధికారులు కనుగొనే విధంగా ఉంచుతారా ?

పాలకులు ప్రభుత్వ సంస్థలను తమ ప్రయోజనాల కోసం ఎలా ఉపయోగించుకుంటారో ఎన్నికల బాండ్ల కేసులో ఎస్‌బిఐ తీరు తిరుగులేని విధంగా వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును వమ్ముచేసేందుకు తమ దగ్గర ఉన్న ఆధారాలను సమర్పించాలంటే మూడు నెలలు పడుతుందని కోర్టునే తప్పుదారి పట్టించేందుకు చూసింది. చివరకు విధిలేక వెంటనే సమర్పించింది.అది ఎలా సాధ్యమైంది? ముందు ఎవరిని రక్షించేందుకు తలాయించినట్లు? కచ్చితంగా బిజెపిని రక్షించేందుకే అన్నది స్పష్టం. రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన స్టేట్ బ్యాంకు పరువు మురికిగంగలో కలిసింది. అక్రమాలకు పాల్పడిన ప్రయివేటురంగ ఎస్ బాంకును ఆదుకొనేందుకు అధికారంలో ఉన్న పెద్దలు ఆరువేల కోట్ల రూపాయలను ఎస్‌బిఐ ద్వారా ఇప్పించినపుడే అది స్వతంత్ర సంస్థకాదు పాలకుల కీలుబొమ్మ అని తేలింది.

సిబిఐ, ఇడి డైరెక్టర్ల పదవీ కాలాన్ని నియంత్రించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఉందని 2023 జులైలో ముగ్గురు సభ్యుల సుప్రీం కోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. అందువలన ఆ సంస్థల పదవుల్లో ఉన్నవారు, వాటికోసం అర్రులు చాస్తున్నవారు కేంద్ర పెద్దలు చెప్పినట్లుగా నడుచుకుంటారన్నది స్పష్టం. అందుకు సిద్ధపడ్డ వారినే ఎంపిక చేస్తారు. అందువలన అవి స్వతంత్ర సంస్థలని చెప్పటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదు. గతేడాది మార్చి నెలలో పద్నాలుగు ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఇడి అరెస్టుల నుంచి రక్షించాలని సుప్రీంకోర్టు తలుపు తట్టారు. గడచిన పదేండ్ల కాలంలో ఆ సంస్థ చేసిన అరెస్టుల్లో 95శాతం ప్రతిపక్షాలకు చెందిన వారే ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆలోచన ఎంత ప్రమాదకరంగా ఉందో ఒక కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెల్లడించింది. నిందితుడిని అరెస్టు చేసేందుకు ఇడి తగిన కారణాలు చూపుతూ ఎలాంటి మినహాయింపులు లేకుండా రాతపూర్వకంగా నోటీసు అందచేయాలని ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం, ఇతరులు దాఖలు చేసిన పిటీషన్ మీద ఎలాంటి పునరాలోచన అవసరం లేదని పేర్కొన్నది. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదనే ఒక్క కారణంతో కూడా ఎవరినైనా అరెస్టు చేయవచ్చనే ఇడి వాదనను తోసిపుచ్చుతూ ఒక మనీలాండరింగ్ కేసులో గతేడాది అక్టోబరులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇడి తీరు పారదర్శకంగా ఉండాలని, వేధింపులకు గురిచేస్తున్నట్లుగా ఉండకూడదని పేర్కొన్నది. మనీలాండరింగ్ చట్టం 2002లో సెక్షన్ 50 ప్రకారం సమన్లకు సాక్షి సహకరించటం లేనందున సెక్షన్ 19 ప్రకారం అరెస్టుకు అతడు లేదా ఆమె అర్హురాలే అని ఇడి చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. దీనిమీద పునరాలోచన చేయాలంటూ ఇడి వాదనను సమర్ధిస్తూ కేంద్రప్రభుత్వం ఒక పిటిషన్ దాఖలు చేయటం నిరంకుశ అధికారాలను దానికి కట్టబెట్టాలని చూడటమే.

ఎన్నికల బాండ్లు అంటే అక్రమంగా తీసుకొనే విరాళాలను సక్రమంగా చేసే పెద్ద అవినీతి తప్ప మరొకటి కాదు. దీని మీద దేశంలోని మీడియా వ్యవహరించిన తీరు సదరు అక్రమాన్ని దాచిపెట్టేందుకే చూసింది తప్ప మరొకటి కాదు. రాజీవ్ గాంధీ హయాంలో జరిగిన 64కోట్ల బోఫోర్స్ కుంభకోణం ఏనుగు ముందు ఎలుక వంటిది. కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన విరాళాల గురించి ఏ ఒక్క బడా పత్రిక, ఛానల్ గానీ ఆరేండ్లుగా ఏ ఒక్క పరిశోధన కథనాన్ని ప్రచురించ లేదు.ఈ కాలంలో గోడీ మీడియాగా మారిపోవటమే అసలు కారణం. గోడీ అంటే నచ్చిన వారి ఒళ్లో కూర్చుని కబుర్లు చెప్పటం. రాజకీయ నేతలను బెదిరించినట్లుగానే మీడియా యాజమాన్యాల మీద కూడా దర్యాప్తు సంస్థల కత్తిని చూపటం, ప్రధాన మీడియా కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఉండటం, అది నరేంద్రమోడీ మద్దతుదారుగా మారిన తరువాత వాస్తవాలను వెల్లడించేందుకు ఎవరైనా ఎందుకు ముందుకు వస్తారు. వాస్తవాలను వెల్లడిస్తున్న న్యూస్ క్లిక్ వంటి ఒక చిన్న సంస్థను కూడా సహించలేక దానికి చైనా నుంచి నిధులు వస్తున్నాయంటూ ఆధారం లేని ఆరోపణలను చేస్తూ యజమానులను ఎలా వెంటాడుతున్నదీ చూస్తున్నాము. నిజానికి మీడియా రంగంలోకి దిగితే అక్రమాలను వెలికితీయటం కష్టం కాదు. ప్రస్తుతం మనదేశంలో నిలిచిపోయిన అఫ్‌పోస్ట్ ఇండియా పత్రిక సమాచార హక్కు చట్ట నిబంధనలను ఉపయోగించుకొని ఎన్నికల బాండ్ల అక్రమాన్ని వెల్లడించింది. గడువు ముగిసిన ఎన్నికల బాండ్లను రాజకీయ పార్టీలు తమ ఖాతాలకు మళ్లించుకోకూడదు. కానీ ప్రధాని నరేంద్రమోడీ కార్యాలయ జోక్యంతో 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు పదికోట్ల రూపాయల మురిగిపోయిన బాండ్లను మార్చుకొన్న తీరును ఆ పత్రిక బయటపెట్టింది. ఆ బాండ్లు ఏ పార్టీకి వెళ్లి ఉంటాయో వేరే చెప్పనవసరం లేదు. 2017–18 2019–20 సంవత్సరాలలో 19పార్టీలు స్వీకరించిన రు.6,201కోట్ల ఎన్నికల బాండ్లలో 68శాతం బిజెపికే వెళ్లినట్లు రిపోర్టర్స్ కలెక్టివ్, ఆర్టికల్ 14 అనే మీడియా సంస్థలు సీల్డ్ కవర్లలో సుప్రీంకోర్టుకు ఇచ్చిన వాటిలో ఏముందో 2022లోనే వెల్లడించాయి. ఎన్నికల బాండ్ల కోసం కార్పొరేట్ సంస్థలు సూట్‌కేస్ కంపెనీలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని గతంలో ఎన్నికల కమిషన్ కేంద్ర న్యాయశాఖకు రాసిన లేఖ గురించి కూడా ది వైర్ వెల్లడించింది.

ముంబయి కేంద్రంగా హిందూస్థాన్ టైమ్స్‌లో పనిచేసిన సీనియర్ ఎడిటర్ సతీష్ నందగోంకర్‌ను ఆ పత్రిక ఎడిటర్ వేధించిన తీరు అతను మరణించిన తరువాత వెల్లడైంది. ముంబయి ప్రెస్ క్లబ్ ఆ మరణానికి దారితీసిన కారణాలపై పరిశోధన జరిపింది. కొంత మంది ఫ్రీలాన్సర్ జర్నలిస్టులు రాసిన వార్తలను ప్రచురించాలని నందగోంకర్ సంపాదకుడికి పంపారు. వాటిని ప్రచురించకపోవటమే గాక పనికిమాలినవంటూ అవమానించాడు. అయితే పత్రికలో తనకున్న అవకాశాన్ని వినియోగించుకొని ఆన్‌లైన్ ఎడిషన్‌లో వాటిని ప్రచురించారు. అవి ముద్రణ సంచికల్లో రాలేదు. కొన్ని రోజుల తరువాత నందగోంకర్ ఆన్‌లైన్ స్టోరీలను ఎంపిక చేసి ప్రచురించే బాధ్యతల నుంచి తొలగించి అవమానించారు. ఆ ఒత్తిడితో అతను గుండెపోటుకు గురై మరణించినట్లు తేలింది. తమకు నచ్చని కథనాలను రాసే జర్నలిస్టులను యజమానులు ఎలా వేధించేది అందరికీ తెలిసిన సత్యమే. దీనికి మీడియా యాజమాన్యాలకు, పార్టీలకు, అధికారంలో ఉన్నవారితో ఉన్న పరస్పర ప్రయోజన సంబంధాలే కారణం. గతంలో కూడా వివిధ వ్యవస్థలను అధికారంలో ఉన్న కాంగ్రెస్ దుర్వినియోగం చేసింది. ప్రతిపక్షంగా దాన్ని విమర్శించిన బిజెపి ఇప్పుడు అంతకంటే వేగంగా, దారుణంగా దుర్వినియోగానికి పాల్పడుతోంది. వ్యవస్థల మీద జనాలకు విశ్వాసం కోల్పోవటాన్ని వేగిరం చేస్తోంది.

# తొల్కట్ట గ్రామ భూపోరాటంలో పేదల విజయం

హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ కంచ భూములున్నాయి. దామగుండం కంచ, ముడిమ్యాల కంచ, చీకటి వెంకటేశ్వరస్వామి కంచ, జాపాల కంచ ఇలాంటి పలు పాకెట్స్ వున్నాయి. ఇవి కాకుండా చిన్నచిన్నవి పలు కంచెలున్నాయి. 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్టు ఇంత పెద్దఎత్తున భూములు ఉన్నా జిల్లాలోని పేద ప్రజలకు దక్కింది తక్కువే. భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లాలో 'మన ఊళ్ళో ప్రభుత్వ భూమి మనదే' అంటూ ప్రజలను చైతన్యపరిచి వారిని సమీకరించింది. సిపిఐ నాయకత్వంలో జిల్లాలో అనేకచోట్ల భూ పోరాటాలు జరిగాయి. స్థానిక పరిస్థితులు, ప్రజల చైతన్య స్థాయిలకు తగ్గట్టు కార్యాచరణ వుండాలని నిర్ణయం. నిరంతర పోరాటాలు, కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున చురుకైన వారికి గుర్తింపు వచ్చింది. పలువురు సామాన్యులు నాయకులుగా గుర్తింపుపొందారు. పార్టీ సాధించిన మొదటి విజయం అనాలి. పలుచోట్ల కొత్త కాలనీల నిర్మాణం జరిగింది. వందలాది మందికి, ముఖ్యంగా కార్యకర్తలకు ప్రభుత్వ స్వంత ఇండ్లు, భూములు వచ్చాయి. తొల్కట్ట....బీజాపూర్ హైవేకు ఒకటిన్నర కిలోమీటర్ దూరాన వున్న రోడ్డు సైడ్ గ్రామం అది. మొయినాబాద్, చేవెళ్ల మండల కేంద్రాలకు మధ్యనుంది. అక్కడ బిసిలు, మైనారిటీ లు, దళితులే ప్రధాన జనాభా. మెట్ట వ్యవసాయమే అప్పటి జీవనాధారం. వారికి ఇండ్ల స్థలాలు ప్రధాన సమస్య. హైవే ప్రక్కన వున్న 12 ఎకరాల ప్రభుత్వ భూమిని నివేశనా స్థలాల కు ఇవ్వాలని కోరాం. పార్టీ జనసమీకరణ మొదలు పెట్టింది. పార్టీ అప్రోచ్, ఆచరణ ప్రజలకు నచ్చాయి. వేగంగా ఆకర్షితులై అధిక సంఖ్యలో పాల్గొనసాగారు. జనం చూపుతున్న ఆసక్తి, ఉత్సాహాన్ని గుర్తించి మిలిటెంట్ పోరాట పద్ధతులను ఎంచుకుని భూమిని అక్రమించి, గుడిసెలు వేసాం. రోజు రోజుకు గుడిసెలు వేసుకునే వారి సంఖ్య ఎక్కువైంది. జరుగుతున్న పరిణామాలను గమనించిన అధికార పార్టీ నాయకులు పరేషాన్ అయ్యారు. తమ చెప్పుచేతల్లో వున్న రెవెన్యూ, పోలీస్ బలగాలను మొహరింపచేశారు. హఠాత్తుగా గుడిసెలను నేలమట్టం చేసి ప్రభుత్వభూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయాని బోర్డు పెట్టారు. అలాంటి విషయాలను చూసిన అనుభవంలేని సామాన్యులు భయభ్రాంతులయ్యారు. ఆర్థికం గా శక్తిలేనివారు భారాన్ని మోయలేక వెనకడుగు వేశారు. అయినా మరో దశ పోరాటానికి సిద్దమయ్యారు. కొంతకాలం ఆగి, ఉత్సాహం పెంచుకుని మళ్ళీ గుడిసెలు కట్టుకున్నారు. ఈసారి అక్కడే ఉండసాగారు. అయితే వారికి నీరు, కరెంటు రూపంలో కొత్త సమస్యలు ఎదురయ్యాయి. అప్పుడు సిపిఐ రాజ్యసభ్యులు కామ్రేడ్ దాసరి నాగభూషణరావు బోర్‌వెల్ వేసుకోవడానికి ఎంపి ల్యాండ్ నిధులను మంజూరు చేశారు. భూపోరాట ప్రాంతానికి వచ్చి సంఘీభావం ప్రకటించారు. పోరాటం ఇలా కొనసాగుతుండగా, అకస్మాత్తుగా ఓ రోజు రాత్రి, అందరూ నిద్రలో వుండగా గుడిసెలకు నిప్పు అంటుకు ని కాలిపోయాయి. సమస్తం బుగ్గిపాలు. నిలువ నీడలేక, తిండి లేక తల్లీ, పిల్లా అల్లాడిపోయారు. వారి కోసం జోలె పట్టాం. పోలీస్, రెవెన్యూ కార్యాలయాల ముందు పలుసార్లు నిరసనలు చేసినా మా గోడు పట్టించుకున్నవాడు లేడు. ఎవరి నీ అరెస్టు చెయ్యలేదు. కొన్నాళ్లకు కేసు మరుగున పడింది. కమ్యూనిస్టు పార్టీపై ఒత్తిడిని పెంచి, దృష్టిని మరల్చేందుకు కొత్త ప్రయత్నాలు చేయసాగారు. జిల్లాలో అక్కడక్కడ దాడు లు, కేసుల రూపంలో కొత్త ఇబ్బందులు మొదలయ్యాయి. జాపాల, కందుకూర్‌లో ఘర్షణలు జరిగాయి. శంషాబాద్ మండలం జాగిర్ భూమి సమస్య వున్న ప్రాంతంలో పశువుల కొట్టాలు తగులబడి మూగ జీవాలు చనిపోయాయి. ప్రభుత్వ అధికారుల బెదిరింపులు, పదవుల్లో వున్న నాయకుల హెచ్చరికలు ఎక్కువయ్యాయి. పరిస్థితి ఘోరంగా, తీవ్రంగా మారింది. బెదిరించి, భయపెట్టి, భయభ్రాంతులను చేయాలనుకుని వుంటారు.

**మరలా తొల్కట్ట పోరాటానికి వస్తే...**

దొంగచాటున దాడులు చేసి, తగులపెట్టడం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు బాగా పెరిగాయి. అందరికీ వారితత్వం బోధపడిం ది. అప్పటివరకూ భయపడి, అణిగిమనిగి ఉన్న జనం ధిక్కార స్వరం పెంచారు. చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఈ సెగ పాకింది. క్రమంగా కమ్యూనిస్టు పార్టీకి ఆదరణ పెరిగింది. కొత్తచోట్ల జండా పండుగలు జరుగుతున్నాయి. ఇక్కడేమో బాధితులు గుడిసెలను కాల్చిన చోటే మొండిగా నివాసం వుంటున్నారు. హైవేపై గుంపులకొద్దీ జనం, ఎర్ర జండాలు దర్శనమిస్తున్నాయి. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ మొదలు వికారాబాద్ వరకూ ఎర్ర జెండా దిమ్మెలు వెలిసి, జండా రెపరెపలాడే దృశ్యాలు పేదలకు మరింత చైతన్యాన్ని కలిగిస్తున్నాయి. కొందరు అక్కసుతో

**యాదికొస్తున్నాయి**



వున్నారని ప్రముఖ గ్రేప్ అడ్వైజర్ అడపా అప్పారావు ఓ సందర్భంలో అన్నారు. ఇండ్ల స్థలాల సమస్యకు ముగింపు పలకాలనుకున్నారేమో, ఓ మెట్టు దిగారు. గ్రామం వెనుకవున్న బొందలగడ్డ పక్కన ప్రభుత్వ భూమి మూడెకరాలు ఇస్తామని, అక్కడ ఇండ్లు కట్టుకోమని అధికారులు (ఎ.ఆర్.దేవరాజ్, నేను వెళ్ళినపుడు) ప్రతిపాదించారు. చర్చించి ఈ ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించారు. ఈ పరిణామంతో పేదలకు నివేశనా స్థలాలు సాధించగలమనే ధీమా పెరిగింది. ఇక మీదట రాత్రి పూట కాపలా ఉండాలనే ఆలోచన చేసి అమలు చేసాం (గుడిసెలకు నిప్పంటిస్తున్నందున). రోజూ ఒక్కో మండలం నుండి కార్యకర్తలు రావా లి. బియ్యం, పప్పులు తెచ్చుకుని అక్కడే వండుకుని తినాలి. ఇవన్నీ అమలయ్యాయి. ఇలా వుండగా ఈ భూమి నాది అంటూ సయ్యద్ జక్కీర్ పాషా హడావుడి చేయసాగాడు. అతడు ఎవరికీ తెలియని కొత్తవాడు. ఓ రోజు అతను దగ్గరలోనే వున్న రావులపల్లికలాన్‌కు వచ్చాడు. పార్టీలో గట్టి నాయకుడైన పి.నాగిరెడ్డి ఆ ఊర్లోనే వుంటాడు. ఉదయమే నాగిరెడ్డి ఇంట్లో ప్రత్యక్షమై డబ్బున్న పెట్టెను చూపి ఇచ్చాడు. పరేషాన్ అయిన నాగిరెడ్డి వెంటనే నాకు ఫోన్ చేసి జరిగింది వివరించి, ఆయన ఇక్కడే ఉన్నాడని చెప్పాడు. 'ఒక్క రూపాయి ఇవ్వొద్దు తీసుకోవద్దు' అనేది జిల్లాలో పార్టీ బహిరంగ నిర్ణయం, నినాదం కదా అని అన్నాను. అదొక్క మాటే నాగిరెడ్డితో ప్రస్తావించి ఫోన్ పెట్టేశాను. వచ్చిన వాడు వచ్చినట్టే పెట్టెతో సహా తిరుగుముఖం పట్టాడు. మరి కొంత కాలానికి మానవత్వం మంట కలిసేలా రెండవసారి గుడిసెలకు నిప్పుపెట్టి కాల్చివేశారు. సమస్తం అగ్గిపాలైపోయింది. ఈ ఘటన అందరినీ బాగా కృంగదీసింది. మరోసారి పేదవారు సర్వస్వం పోగొట్టుకుని రోడ్డున పడ్డారు. అర్ధబలం, అంగబలం వున్న వారిని ఢీకొడుతున్నాం. ప్రమాదం ఎవరికి, ఏరూపంలో ఎదురవుతుందో అనే అనుమానం మొదలైంది. అయినా పోరాటం ఆగలేదు...వారూ తమ కుతంత్రాలను ఆపలేదు.

**మరో కుట్రకు తెర లేచింది..**

ఈసారి నాగిరెడ్డి గ్రామం వేదిక అయ్యింది. రోజులాగే ఆ రోజూ కూడా నాగిరెడ్డి కోసం ఇంటికి ఫోన్ చేసా. అతను ఇంట్లో లేనందున ఆడవారు పలికారు. ఊళ్ళో రోజూ నలుగురైదుగురు మహిళలు బాణామతి కారణంగా కిందపడి పొర్లుతూ, నాగిరెడ్డి పేరు ఒర్లుతున్నారని ఆందోళనగా చెప్పింది. దీనివెనుక చెడు ఆలోచన వున్నదనే అనుమానంతో, మారికొన్ని వివరాలు సేకరించాను. ఆలస్యం చేయకుండా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పిని స్వయంగా కలిశాను. తొల్కట్ట భూ పోరాటానికి ఇక్కడి బాణామతికి లింక్ వున్నదనే నా భయాన్ని వారికి వివరించి, పరిస్థితి చేయిదాటక ముందే చర్య తీసుకోమని కోరాను. మరుసటి రోజే డిఎస్‌పి వచ్చాడు. సరిగ్గా అదే సమయానికి గ్రామ కూడల్లో బాణామతి సీన్ రిపీట్ అవుతూ ఉన్నది. పోలీసులు వెంటనే వారి భర్తలను పట్టుకొచ్చారు.వారి భాషలో తిడుతూ, హెచ్చరిస్తూ జీప్ ఎక్కించారు. అంతే, పూనకాలు, ఒర్లడాలు అన్నీ అప్పటికప్పుడు బంద్. ఈ ప్రాంతంలో టార్గెట్ చేసిన వ్యక్తికి హానిచేసే ముందు ఆడవారితో పూనకాలు చేయించి పేరు చెప్పిస్తారు. ఇది జరిగిన మరి కొన్నాళ్లకు అనగా మార్చ్ నెల 21వ తేదీ (2001) సాయంకాలం దుర్వార్త విన్నాం. సిపిఐ మొయినాబాద్ మండల సహాయ కార్యదర్శి, తొల్కట్ట గ్రామస్తుడు, భూపోరాటంలో కీలక వ్యక్తి లింగంగౌడ్ దుర్మరణం చెందాడు. వేసుకున్న గుడిసె ఇళ్లకు దగ్గరలో పొదల గుంత లో పడివున్న శవాన్ని కత్తుల గోపాల్ అనే గ్రామస్తుడు చూసి కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ గోపాల్ ప్రజల పోరాటాన్ని వ్యతిరేకిస్తున్న ప్రత్యర్థుల్లో ముఖ్యుడు. అంత తొందరగా అక్కడకు ఎలా వచ్చాడు, ఎందుకు వచ్చాడనే అనుమానాలు అందరిలో కలిగాయి. వార్త అత్యంత వేగంగా వ్యాపించి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. చుట్టు పక్కల గ్రామాల నుండి వేల సంఖ్యలో ప్రజలు వచ్చారు. ఆ రాత్రి నాతోపాటు నా భార్య ఉష, వందలాదిమంది ప్రజలు అక్కడే జాగరణ చేశారు. తెర వెనుకున్న పెద్దలు సహితం భయంతో కూడిన జంకుతో వచ్చి లింగంగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. మరుసటి రోజు అంత్యక్రియలకు ముందు మొయినాబాద్ కేంద్రంలో జరిగిన పెద్ద సభలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కె.నారాయణ, టి.లక్ష్మి నారాయణ ప్రసంగించారు. తర్వాత కత్తుల గోపాల్ అనే అనుమానితుడు పలు సంవత్సరాలు కనిపించకుండా పోయాడు. ఇంత జరిగినా అసలైన సమస్య పరిష్కా రం కాలేదు. అప్పటివరకూ, ఉద్రిక్తత తగ్గేవరకు మెదలకుండా వున్న శక్తులు మరోసారి విజృంభించాయి. అకస్మాత్తుగా సయ్యద్ జక్కీర్ పాషా మరోసారి తెరపైకి వచ్చి, మొత్తం భూమిని స్వాధీనం చేసుకుని కంచెవేసి, ఫామ్ హౌస్ అంటూ పెద్ద బోర్డు నాటాడు. అతను భూమిని స్వాధీనం చేసుకుని రెండు నెలలు అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇది ప్రభుత్వానికి చెందినదంటూ పేదల గుడిసెలను కూల్చిన పెద్దలు ఇపుడు జక్కీర్‌పాషా తన పట్టా భూమిని పట్టపగలు ఆక్రమిస్తే మౌనంగా ఎందుకున్నారు? వాస్తవాలు బట్టబయ్యలయ్యాయి. ప్రజలు బాగా ఛార్జ్ అయివున్నారు. ఇదే అదను అనుకుని ఫామ్ హౌస్‌పై దాడి చేయమని ప్రజలను ప్రోత్సహించాం. ఆ రోజు రాత్రే దాడి జరిగింది. పాతిన కడీలను, బిగించిన తీగ ను, బోర్డు అన్నింటినీ తుక్కుతుక్కుగా పగులకొట్టేశారు. తెల్లారి జక్కీర్ పాషా పదుల సంఖ్యలో, ఆయుధాలు పట్టిన గుండాలతో వచ్చాడు. ఆరోజు వర్షం జల్లు కురుస్తున్నది. ప్రజలు భయకంపితులై వణికిపోయారు. హుటాహుటిన బయలుదేరి తొల్కట్ట గేటుకు ఎదురుగా వున్న బస్ షెల్టర్‌కు ముందు నిలబడ్డాను. గ్రామస్తులకు సార్ వచ్చి నిలబడ్డాడు, అందరినీ రమ్మంటున్నాడనే వార్త గ్రామంలో వ్యాపించింది. ఆడమగ, ముసలి ముతకా, హిందూ ముస్లిం అనే భేదం లేకుండా చేతికి దొరికిన ఆయుధాన్ని పట్టుకుని, వర్షంలో తడుస్తూ, గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో పరుగుపరుగునా వచ్చి వాలి నినాదాలు మొదలుపెట్టారు. మేము సిద్ధం, ఇపుడు రా అని జక్కీర్‌కు సవాల్ చేశారు. పరిస్థితిని గమనించిన జక్కీర్ అక్కడకు వచ్చి శ్రీనివాస్ సార్‌కు సగం భూమిని స్వచ్ఛందంగా దానం ఇస్తున్నట్లు ప్రకటించి, అప్పటికప్పుడు స్టాంప్ పేపర్‌పై నా పేరిట రాసి ఇచ్చాడు. గ్రామస్తులకు తిరుగు దానంగా ప్రకటించి, అందరూ పక్కాగా ఇళ్లు కట్టుకోమని కోరాను. తర్వాత కాలంలో పట్టాలు పంపకం చేసాం. హైవే పక్కన ఈ కొత్త కాలనీ భూపోరాటంలో అమరుడైన లింగంగౌడ్ పేరుతో 'లింగంనగర్'గా స్థిరపడింది. అతడి కుటుంబానికి రోడ్డుకు మరో వైపు రెండెకరాలు భూమి లావుని పట్టా ఇప్పించాం. ప్రస్తుతం అక్కడ స్థూపం కూడా వున్నది. ఏళ్ల తరబడి జరిగిన పోరాటంలో చాలామంది చురుగ్గా పాల్గొని సహకరించారు. ఒక్కరి పేరు మరిచిపోయినా వారు బాధపడతారు. జీవితంలో ఎన్నో అనుభవాలను, పాఠాలను నేర్చుకున్నాను. మిలిటెంట్ పోరాట కాలం మరలా రావాలి. ప్రజలను ఆదుకునే పార్టీగా కమ్యూనిస్టు పార్టీ మరింత ఖ్యాతి గడించాలి.

పి.శ్రీనివాసులు నాయుడు

(సామాన్యుల్లో ఒకడై పనిచేసిన సిపిఐ కార్యకర్త )

## పురస్కారంపై రాద్ధాంతం ...



మనదేశంలో కులతత్వం, మతవాదం ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయడానికి ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు, 48 ఏళ్ల తోడూర్ మాడభూషి కృష్ణ (టిఎం కృష్ణ)కు 'సంగీత కళానిధి' అవార్డును మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ ప్రకటించిన తర్వాత చోటు చేసుకుంటు న్న పరిణామాలే నిదర్శనం. తన 12వ ఏట నుంచి కర్నాటక సంగీతంలో రాటుదేలి, ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టిన కృష్ణ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తీవ్రంగా ద్వేషించి, నిరసించి, పోరాడిన పెరియార్ భావజాలాన్ని సమర్థిస్తున్నారు. పెరియార్ చేసిన సామాజిక కృషిపై ఎన్నో పాటలు రాశారు. ఒక సంగీతజ్ఞుడిగానేగాక, రచయితగా, సామాజిక కార్యకర్తగా కూడా పేరు సంపాదించిన కృష్ణ అంటే ఛాందవాసులకు గిట్టదు. అందుకే, ఆయనకు పురస్కారాన్ని ప్రకటించిన వెంటనే అటువంటి కళాకారుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిఘటనలు నింగినంటాయి. 'విదుషీ సిస్టర్స్' రంజని, గాయత్రి అకాడె మీ కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఆ కార్యక్రమంలో తమ ప్రదర్శనను రద్దు చేసుకున్నారు. ప్రముఖ హరికథా కళాకారులు దుష్యంత్ శ్రీధర్ తదితరులు వీరికి వంతపాడారు. ప్రముఖ వీణావిద్వాంసుడు రవికిరణ్ మరో అడుగు ముందుకేసి, 2017లో తనకు వచ్చిన అవార్డుని తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతమంది ఇంత లా వ్యతిరేకించడానికి కృష్ణ ప్రతిభపై ఉన్న అనుమానాలో లేక సంగీతంపై ఆయనకు ఉన్న పట్టుపై సందేహాలో కారణం కాదు. ఆయన బహిరంగం గా చెప్తున్న సామాజిక అంశాలు, అభిప్రాయాలనే వీరంతా తప్పుపడుతున్నారు. అందుకే, ఇంతటి తీవ్ర స్థాయిలో విమర్శలకు దిగుతున్నారు. అయో ధ్య నుంచి రాముడి వరకూ పలు విషయాలపై కృష్ణ వెలిబుచ్చిన అభిప్రాయాలపై మండిపడుతున్న ఛాందసవాదులు ఆయనకు అవార్డు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు కళారంగంలో పురస్కారం ఇచ్చారే తప్ప సామాజిక కార్యక్రమాల గురించి కాదుకదా? ఆ అవార్డును ఆయన అర్హుడా? కాదా? అన్నదే ప్రశ్న. వ్యక్తిగత అభిప్రాయాల ను కళకు, ప్రతిభకు ముడిపెట్టడం సరికాదు. సంప్రదాయ విధానాలకు కృష్ణ స్వస్తి చెప్పడం కూడా కొంతమంది ఆగ్రహానికి కారణం. ఎందుకంటే ఆయన కచేరీలకు ప్యాంటు, షర్టు వేసుకొని హాజరవుతారు. కచేరీలు చేయడం తెలుసుగానీ, సంగీతానికి సంబంధించిన వివరాలు, సాంకేతికతలు తనకు తెలియవని ఆయన అంటుంటారు. త్యాగరాజ కీర్తనల నుంచి అనేకానేక శాస్త్రీయ గీతాలను అలపించే సమయంలో, సంప్రదాయ విధానాలకు కట్టుబడడం ఆయనకు ఇష్టం ఉండదు. ఒక పదాన్ని విడదీసి రాగాలాపనల కంటే, సంగీతాన్ని కొద్దిగా మార్చడం వల్ల నష్టం లేదని కృష్ణ వాదన. సహజంగానే ఇది చాలా మందికి మింగుడుపడని అంశం. 2016లో ఆసియాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రామన్ మెగసెసే అవార్డును స్వీకరించిన కృష్ణ, సంగీత ప్రపంచం ఎంతో గొప్పగా కొలిచే చాలామందిని విమర్శించారు.

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
హైదరాబాద్ | శుక్రవారం | 29 మార్చి, 2024 | 5


## ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపిటిసిలు



**ప్రజాపక్షం/కొత్తూరు:** శాసన మండలి ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం కొత్తూరు మండల ఎంపిటిసి సభ్యులు సత్యమ్మ, రవీందర్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫరూఖ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయంలో కేశంపేట జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డితోపాటు షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీస్ భారీ బందోబస్తు మధ్య స్థానిక ప్రజాప్రతినిధులు ట్రావెల్ బస్సుల్లో క్యాంపు నుండి నేగారు పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# మూసీ భూసేకరణకు ల్యాండ్ పూలింగ్

### మూసీ సమగ్ర అభివృద్ధికి భూసేకరణే సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీనది సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ పట్టుదలగా ఉంది. ఈ నేపత్యంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డిసిఎల్)కు సమగ్ర అభివృద్ధి బాధ్యతలను అప్పగించింది. మూసీకి ఇరువైపులా గ్రోత్ కారిడార్ పేరిట అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు మూసీ ఇరువైపులా భూసేకరణ చేయాల్సిన అవసరం ఏర్పడింది. అయితే మూసీ నది సమగ్ర అభివృద్ధికి ప్రధానంగా భూసేకరణ ప్రక్రియ ఎంఆర్‌డిసిఎల్‌కు పెను సవాల్‌గా మారనుంది. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు తాజాగా ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ విధానం ద్వారా భూసేకరణ సమస్యను అధిగమించాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. మూసీనది లోపల కూడా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు ఉన్నాయి. ప్రభుత్వ భూములను సేకరించేందుకు ఇబ్బందులు లేవు. కానీ ప్రైవేట్ భూములను సేకరించడం అతిపెద్ద సవాల్‌గా మారనుంది. భూసేకరణకు వ్యతిరేకంగా ఎవరైన న్యాయస్థానాలను ఆశ్రయిస్తే ప్రాజెక్టు ముందుకు తీసుకపోవడం ప్రశ్నార్థకంగా మారుతోంది. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టును పట్టాలెక్కించాలని నిర్ణయించారు. హెచ్‌ఎండిఏలో మాదిరిగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ జరిపేందుకు నిర్ణయించారు. సాధారణంగా హెచ్‌ఎండిఏ కనీసం 50 ఎకరాల వరకు భూసేకరణ చేసి, దాంట్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తుంది. ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేసి, భూ యజమానులకు కేటాయించడంతో పాటు వేలం పాట ద్వారా ప్లాట్‌లను విక్రయిస్తుంది. అ యితే మూసీనదిలో తక్కువ విస్తీర్ణంలో ఉన్న భూమి అం దుబాటులో ఉంటుంది. దీంతో కనీసం ఎకరం నుంచి ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని భావిస్తున్నారు. ఈ విధం గా భూమిని ఇచ్చిన రైతులు, భూమి యజమానులకు అందుకు తగ్గట్టుగా మూసీ ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్రాంతాలలో భాగస్వామ్యం కల్పించనున్నారు. ల్యాండ్ పూలింగ్ విధానం ఉభయతారకంగా ఉండటంతో భూ నిర్వాసితులు సైతం ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. భూ నిర్వాసితులకు కూడా లాభం చేకూర్చేలా ల్యాండ్ పూలింగ్ విధానం ఉండనుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. పశ్చిమం నర్సింగి నుంచి తూర్పున గౌరెల్లి వరకు మూసీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో పశ్చిమం నుంచి తూర్పునకు ఔటర్ రింగ్ రో డ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఇస్ట్ వెస్ట కారిడార్ పేరిట భారీ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే నదిపై మధ్యలో పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు నిర్మిస్తారు. నది పరివహక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు రోడ్డు, వివిధ రకాల వాణిజ్య కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లు, రిక్రియేషన్ జోన్‌లను అభివృద్ధి చేయనున్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరించండి

సిపిఐ శే రిలింగంపల్లి కార్యదర్శి రా మకృష్ణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్ కాలనీలో మంచినీటి సమస్యలు లేకుండా చూడాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ మాదాపూర్ హెచ్‌యండబ్ల్యూ మేనేజర్ యాదగిరికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్‌లో నీళ్ళు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇజ్జత్‌నగర్ ఏరియా ఎత్తులో ఉండడంతో పైపులైన్ ద్వార వచ్చే నీరు పైకి రాకపోవడంతో నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎత్తు ఫలం ఉన్న దగ్గ గేట్ వాళ్ళు ఏర్పాటు చేసి నీరు అందేలా చూడాలని తెలిపామన్నారు. నీరు అందే వరకు ట్యాంకర్ల ద్వార నీరు అందించి సమస్యను పరిష్కారించాలని తెలిపారు. సానుకులంగా స్పందించిన మేనేజర్ యాదగిరి త్వరలో సమస్యలను పరిష్కారిస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో కాసిం, నరిసింహ, సుధాకర్, కొండలయ్య, బాల, జట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని టాగూర్ ఉన్నత పాఠశాల చైర్మన్ ఎన్‌కె రాజేంద్రప్రసాద్ వివరించారు. గురువారం పట్టణంలోని టాగూర్ ఉన్నత పాఠశాలలో యుకేజీ పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంతో ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సమయం టెక్నాలజీకి ఎక్కువ సమయం ఇవ్వకుండా తగిన సమయం మాత్రమే కేటాయించేందుకు కృషి చేయాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్దగా నేర్చుకొని భవిష్యత్‌ను బంగారు మయం చేసుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. టెక్నాలాజీకి ఎక్కువ సమయం కేటాయించడం వల్ల ఆలోచన శక్తి కొల్పోవడమే కాకుండా సమయం ఎక్కువగా వృధా అయ్యే అవకాశం ఉంటుందని సూచించారు. ప్రస్తుతం విద్యార్థులు పాఠ్య పుస్తకాల కంటే సాంకేతిక రంగం, టెక్నాలజీపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారని, దాంతో కొంతమేరకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని విద్యార్థులు ఎక్కువ శాతం పాఠ్యపుస్తకాలపైనే దృష్టి కేంద్రీకరించే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని, అప్పుడే వారి భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజలితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ కూల్చేసిన అధికారులు




**ప్రజాపక్షం/ నార్సింగి:** మణికొండ మున్సిపల్ పరిధిలోని మణికొండ వికర్ సెక్షన్ కాలనీ బస్సు స్టాప్ నందు షాపులకు అడ్డంగా ఉంది అని బస్సు స్టాప్ సషెల్టర్‌ను కూల్చడం సరేంది కాదని వీకర్ సెక్షన్ మాజీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం కూల్చివేసిన బస్ స్టాప్ షెల్టర్ ను మున్సిపాలిటీ అధికారులపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న బస్సు సెంటర్‌ను ఎవరు ప్రయోజనాల గురించి కూల్చివేస్తున్నారని ఆయన అన్నారు.. వేసవి కాలం ప్రయాణికులకు కూర్చోవడానికి నీడగా ఉన్నటువంటి బస్సు షెల్టర్ ను కూల్చడం సరి అయింది కాదని లేని ప్రాంతాల్లో సెంటర్లను పెట్టాల్సింది పోయి ఉన్న వాటిని తీసేయడమేంటని అధికారుల పై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లేనిచోట్ల బస్సు సెంటర్లను వేయాలని ఆయన అధికారులను కోరారు.

## ఈటలను భారీ మెజార్టీతో గెలుపిస్తాం

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/వనస్థలిపురం :** మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలుపిస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ నుంచి పార్టీ కార్యకర్తలు భారీ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈటల రాజేందర్‌ను గెలుపించి మోడీకి మహుమతిగా అందజేస్తామని తెలిపారు. బిఎన్‌రెడ్డి నగర్ నుంచి భారీ మెజార్టీ ఓట్లు వచ్చేలా పనిచేస్తామని బరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్తలు సైనికుల పనిచేస్తామన్నారు. అనంత రం ఈటల రాజేందర్, మాజీ ఎంఎల్‌సి రామచంద్రరావు లను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామా రంగారెడ్డి, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సమగ్ర విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ సిఎం కెసిఆర్ ఫామ్ హౌస్‌లోని వార్ రూమ్‌లో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని, ఈ వార్‌రూమ్‌పై దాడి చేసి, ఆధారాలను సేకరించాలని కాంగ్రెస్ నేతలు డిజిపిని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఈ మేరకు టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్, నాయకుడు తుమ్మేటి సమ్మి రెడ్డి హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో డిజిపి రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి, సెలెబ్రెటీలను , వ్యాపారవేత్తలను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. 2021 సంవత్సరంలో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికల సమయం నుండి ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, మాజీ మంత్రి హరీష్ రావు అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని ఇటువంటి అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులతో ఫోన్ ట్యాపింగ్‌ను చేయించారన్నారు.



## ఫోన్ ట్యాపింగ్‌లో 600 లావాదేవీలు?

కెసిఆర్ కుటుంబం కూడా దేశం విడిచి పారిపోయే పరిస్థితి నెలకొన్నది

టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్‌లో ఆరు వందల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ తెలిపారు. కెసిఆర్ కుటుంబం కూడా దేశం విడిచి పారిపోయే పరిస్థితి నెలకొన్నదని, ఆయన కుటుంబ సభ్యుల పాస్ పోర్ట్‌లను స్తంభింపచేయాలని ముఖ్యమంత్రి, కేంద్ర హోంశాఖ, డిజిపిలను కోరారు. మాజీ ఎంఎల్ఎ షకిల్ కుమారుడు విదేశాలకు పారిపోయినట్టుగానే కెసిఆర్ కుటుంబం కూడా పారిపోయే అవకాశం ఉందని నిరంజన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు ఇచ్చే రిలీఫ్ ఫండ్‌లో జరిగిన మోసం కూడా హరీష్ రావు కార్యాలయంలోనే జరిగిందని పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తి తన పిఎ కాదని, కంప్యూటర్ ఆపరేటర్ అని చెబుతున్న హరీష్ రావు, ఎవరైనప్పటికీ మోసం జరిగింది మాత్రం మంత్రి కార్యాలయంలోనే కదా అని ప్రశ్నించారు. ఈ కేసులో హరీష్ రావును కూడా పోలీస్ స్టేషన్ కు పిలిచి విచారించాలని డిమాండ్ చేశారు. మోసగాళ్ళకు ఆశ్రయం ఇచ్చిన హరీష్ రావు కూడా మోసగాడేనని అన్నారు.

## 31 నాటికి కాంగ్రెస్ తుది జాబితా ఖరారు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మిగిలిన లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఈనెల 31 నాటికి ఖరారు చేయనుంది. దా దాపుగా ఇది కాంగ్రెస్ పార్టీ చివరి జాబితా కానుంది. అభ్యర్థులు ఖరారు కావాల్సిన వా టిలో తెలంగాణకు సంబంధించిన నాలుగు లోక్ సభ స్థానాలు కూడా ఉన్నాయి. అవి ఖ మ్మం, హైదరాబాద్, కరీంనగర్ , వరంగల్ స్థానాలు ఉ న్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ 208 మంది అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణకు సంబంధించి 17 స్థానాలలో 13 చోట్ల అభ్యర్థులను ప్రకటించిం ది. ఏడు విడతల్లో జరిగే లోక్‌సభ ఎన్నికల తొలి విడత పో లింగ్ ఏప్రిల్ 19న జరగనుంది. ఈ నేపథ్యంలో తాము పోటీ చేయాల్సిన స్థానాలన్నిటికీ అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది. ఢిల్లీలో ఈ నెల 31న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై మిగతా అభ్యర్థుల జాబితాను తుది రూపున్వినుం ది. ఆ జాబితాలో మహారాష్ట్ర , ఢిల్లీ లో పోటీ చే సే అభ్యర్థులతో పాటు తెలంగాణ అభ్యర్థుల పేర్లు కూడా ఉండే అవకాశం ఉంది.

### నేడు టిపిసిసి కీలక సమావేశం

గాంధీభవన్‌లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు టిపిసిసి కార్యవర్గ సమావేశం జరగనుంది. టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎఐసిసి ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, తదితరులు పాల్గొంటారు. పార్లమెంటు ఎన్నికల వ్యూహాన్ని, ఏప్రిల్ 5 లేదా 6వ తేదీన తుక్కుగూడలో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్ల గురించి ఇందులో చర్చించే అవకాశం ఉంది.

## నేడు కాంగ్రెస్‌లోకి పల్లె లక్ష్మణ్ రావు గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ నాయకుడు, తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మ ణ్ రావు గౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, నగర కాంగ్రెస్, ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2009 సర్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. 2014లో అప్పటి టిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పదేళ్లకాలంలో బిఆర్‌ఎస్ పార్టీలో ఆయనకు ఎలాంటి పదవులు దక్కలేదు. దీంతో సొంతగూటికి వెళ్లేందుకు పల్లే లక్ష్మ ణ్ రావు నిర్ణయించుకున్నారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కీ గౌడ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ చేరనున్నట్లు పల్లె లక్ష్మ ణ్ రావు గౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరడం తనకు సొంత ఇంటికి వెళ్లుతున్న సంతోషం ఉందన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలోని తన మద్దతుదారులతో కలిసి కాంగ్రెస్ చేరుతున్నట్లు చెప్పారు. గౌడ్‌ల సామాజి, విద్య అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రశాంతంగా, పారదర్శకంగా, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా పని చేయాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శశాంక జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ఎన్నికలలో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించవలసి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాల వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇందుకు నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో వీనింగ్ బృందాలు, సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ఎన్ ఫోర్స్మెంట్ బృందాల ద్వారా ఇప్పటి వరకు రూ. 79,41,650 నగదు,రూ.4,18,700 విలువైన 5.30 కిలోల సిల్వర్, రూ.37,53,050.5 విలువ గల 5822.53 లీటర్ల మద్యం, రూ. 3,03,25,575 విలువ గల 716.925 కిలోల డ్రగ్స్,నార్కోటిక్స్‌ను సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ శశాంక వివరించారు. ఆబ్కారీ,రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,10 లక్షలు పైగా డబ్బు పట్టుబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారము అందించాలని చెప్పారు. బ్యాంకు లావాదేవీలపై ప్రతి రోజు నివేదిక అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,డిఆర్ఒ సంగీత, ఎన్ ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్, అనిల్ కుమార్,ఇన్స్పెక్టర్ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, శ్రీచరణ్ జాయింట్ కమిషనర్ సెంట్రల్ ఎక్సైజ్ నోడల్ ఆఫీసర్, సత్యనారాయణ రావు, స్టేట్ ఎక్సైజ్ నోడల్ ఆఫీసర్,రాచకొండ డిసిపి ఉష విశ్వనాథ్, సైబరాబాద్ ఎసిపి చంద్ర కుమార్, ఎల్‌డిఎమ్ కుసుమ,జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుబాష్ చంద్ర, ఎక్స్ పెండిచర్ నోడల్ అధికారి సురేష్ మోహన్, ఎమ్ సిసి నోడల్ అధికారి మ్య,ఎన్నికల విభాగం అధికారి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు లోక్ సభ సాధారణ ఎన్నికల 2024 నేపథ్యంలో, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.శాశంక తెలిపారు. ఇట్టి కమిటీ భారత ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం జప్తు చేసి నగదు, ఇతర వస్తువుల విడుదలకు పనిచేస్తుందన్నారు.రంగారెడ్డి జిల్లా ఫిర్యాదుల కమిటీ''కి చైర్మన్ జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి శ్రీలత, కన్వీనర్ జిల్లా పంచాయతి అధికారి,సురేష్ మోహన్( ఫోన్ నెంబర్ 9849720054),జిల్లా ట్రెజరీ అధికారి,వెంకట రెడ్డి,సభ్యులు ఉన్నారని, కావున సంభదిత ఫిర్యాదుదారులు జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల విడుదలకు సంభదిత వివరాల పత్రాలతో జిల్లా ఫిర్యాదుల కమిటీని సంప్రదించవలసిందిగా జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు.

## శాసన మండలి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలుపు ఖాయం

బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాసన మండలి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ చరిత్ర సృష్టించడం ఖాయమని అభ్యర్థి నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశా రు. గురువారం షాద్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ శాసన మండలి ఉప ఎన్నికల్లో తాను నమ్ముకున్న వ్యక్తులందరు ఎంతో అద్బుతంగా పని చేయడంతోపాటు సహాకరించారని తెలిపారు. మొత్తం 1439ఓట్లలో 300పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు తనపై నమ్మకంతో ఓటు వేసినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్2వ తేదిన వెలువడే ఫలితాల్లో బిఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ప్రతిపక్ష పార్టీ బిఆర్‌ఎస్ గెలుపొందడం జరుగుతుందని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ గెలుపు ప్రజల్లో ఒక సందేహాన్ని ఇవ్వడం జరుగుతుందని, కాంగ్రెస్ నాయకులు క్రా స్ ఓటింగ్‌తో విజయం సాధించడం జరుగుతుందని చెప్పుకోవడం ఆహ్యాస్పదంగా ఉందని అన్నారు. స్థానిక సంస్థల పట్ల తనకు పూర్తి అవగాహన ఉంద ని, ప్రజా ప్రతినిధులతో చర్చించడం జరిగిందని తెలిపారు. ప్రచారంలో తా ను ఎక్కడికి వెళ్ళినా ప్రజాప్రతినిధుల నుండి మంచి స్పందన వచ్చిందని గు ర్తు చేశారు.తనపై ఎంతో విశ్వాసంతో ఎంఎల్‌సి పోటీకి అవకాశం కల్పించిన బిఆర్‌ఎస్ అధిష్టానానికి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, కెటిఆర్‌కు, హరీష్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాను ఇప్పటి వరకు ఓటమి ఎరుగలేదని, ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు.

## చేవెళ్లలో త్రిముఖ పోటీ!

బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశర్ రెడ్డిని ఢీకొనేదెవరో ?

కాంగ్రెస్ అభ్యర్థుల్లో కలిసి రాణి చేవెళ్ల సెంటిమెంట్ !

కాంగ్రెస్ అభ్యర్థిగా రంజిత్ రెడ్డి

బిఆర్‌ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్



**ప్రజాపక్షం/షాబాద్:** చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీకి సై అంటున నేతలు ప్రధాన పార్టీలుగా కాంగ్రెస్, బిజెపి పార్టీల మధ్య గట్టి పోటీ ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ రాజకీయ విశ్లేషకుల వాధన . పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి చేవెళ్ల పార్లమెంట్‌లో రాజకీయ చదరంగం రోజు రోజుకు అనేక మార్పులు రావడం విశేషంగా మారింది . చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా కొండ విశ్వేశ్వర్ రెడ్డిని ప్రకటించడం జరిగింది . కొండ విశ్వేశ్వర్ రెడ్డిని ఢీకొనేది ఎవ్వరనేది ప్రశ్నగా మారింది. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి సెంట్ మెంట్‌గా గుర్తించిన కాంగ్రెస్ నేతలు చేవెళ్ల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థుల కోసం అన్వేషిస్తున క్రమంలో చేవెళ్ల సెంటిమెంట్ కోసం చేవెళ్ల చేల్లమ్మగా గుర్తింపు తీసుకరావాలనే ఉద్దేశంతో బిఆర్‌ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన పట్నం కుటుంబంకు సెంటిమెంట్ వర్తించలేదు. దీంతో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కోసం మరోసారి చేవెళ్ల సెంటిమెంట్‌ను ప్రయత్నించగా బిఆర్‌ఎస్ పార్టీ నుండి ఎంపి అభ్యర్థి రంజిత్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాడు. దీంతో చేవెళ్ల సెంటిమెంట్ భాగ పని చేసిందని పలువురు అనుకుంటున్నారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గా రంజిత్ రెడ్డిని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆధేశాల మెరకు చేవెళ్ల సెంటి మెంట్ పేరుతో పార్టీ సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవడం సరికాదని విమర్శలు చేయడం చర్చనీయ అంశంగా మారింది . చేవెళ్ల పార్లమెంట్‌లో అత్యధికంగా కాంగ్రెస్ గాలి వీస్తుందని ఆస్తులు కాపాడుకోవాడానికి , ప్రజల కోసం కాకుండ పదవుల కోసం బిఆర్ ఎస్ పార్టీ నుండి వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ తరపున ప్రజలకు సేవ చేసేవారు ఎవ్వరో .. ఎవ్వరికి ఓటు వేయాలో చేవెళ్ల ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుపై ఆధారిపడి ఉంటుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** డబ్బల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణరాష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో పర్యటించి పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్టం మిగులు ఆదాయంగా ఎర్పాటై గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అప్పుల రాష్టంగా అవతరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో డబ్బల్ ఇంజన్ సర్కార్ వచ్చిన వెంటనే తెలంగాణ సోమ్మును దోచుకున్న దొంగలను జైలుకు పంపి దోచుకున్న సంపదను రికవరి చేస్తామని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ నేతలో రోజు రోజుకు దోచుకున్న సోమ్మును భయటకు రావడంతో జైలపాలవుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్టంలో త్వరలో తప్పుచేసిన మరికొందరికి చట్టపరమైన శిక్ష తప్పదని వివరించారు. దేశ రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న దేశ ప్రధానికి చేవెళ్ల ఎంపిని గెలిపించి గిఫ్ట్‌గా ఇవ్వాలని చెప్పారు. తెలంగాణలో బిజెపి ఎంపిలు గెలిపిస్తే కేంద్రం నుండి అధిక నిధులతో రాష్టం అభివృద్ధి చేయడానికి మంచి అవకాశం ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటిన ఆరు గ్యారెంటీలో కేవలం మహిళ్లలకు బస్సు ప్రయాణం మాత్రమే అమలులో ఉందని మిగిత పథకాలు ప్రజలకు అందడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం అయిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంకు చాతకాదని విమర్శించారు. ఆఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహ్మా రెడ్డి, చేవెళ్ల ఇంచార్జ్ కేవేస్ రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు కిరణ్ కుమార్, స్వచ్ఛ భారత్ రాష్ట నాయకులు రాము, పార్టీ సినియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎలక్ట్రిసిటి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు అన్నారు. గురువారం సిఐటియు మేడ్చల్ సర్కిల్ సమావేశాన్ని ప్రగతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ సర్కిల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌతమ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా రవి, శ్రీకాంత్, కార్యదర్శిగా ఓబులెసు, జాయింట్ సెక్రటరిగా దస్రునాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా ప్రసాద్, కోశాధికారిగా వాసు, కమిటీ సభ్యులుగా రమేష్, రవీంద్రబాబు, ప్రవీన్, రమేష్, మోహన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవీందర్, ప్రసాద్‌రాజు, మధు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వేరుపై అవగాహన




**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఇంటి నుంచి వెలువడే చెత్తను బహిరంగా ప్రదేశాలు, రోడ్లపై వేయకుండా జిహెచ్‌ఎంసి ఆటోలలో వేయాలని పారిశుద్ధ్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు. గురువారం కుషాయిగూడ గ్రామ వీధుల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త బండిలోనే వేద్దామని గ్రామస్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ కుషాయిగూడ వర్ధిల్లాలి,, చెత్త బండిలోనే చెత్తను వేద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, కుషాయిగూడ గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవటం ద్వారా వారి నుండి మంచిని ఆశిస్తూ దేశ ప్రగతిని సాధించవచ్చుని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి సాంబశివరావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెంగ్మెంట్లలో చేపట్టే స్వీప్ కార్యక్రమాల ద్వారా పోలింగ్ శాతం పెంచేలా చేస్తామన్నారు. దీనిలోని భాగంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించటం, విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా చైతన్యం తేవాలన్నారు. కొత్తగా నమోదు చేసుకొన్న యువ ఓటర్ల తో సహా వృద్దులు, దివ్యాంగులందరూ తప్పని సరిగా తమ ఓటు హక్కు నినియోగించుకొనేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో క్యాంపస్ అంబాసిడర్లను నియమించుకొని ప్రతి పోలింగ్ కేంద్వానికి వెళ్లి తప్పని సరిగా ఓటు వేసేలా క్యాంపస్ అంబాసిడర్లు అవగాహన కల్పించాలన్నారు.

## 'ఉపాధి'లో వికారాబాద్ మొదటిస్థానం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను వికారాబాద్ జిల్లాలో అత్యధిక కూలీలకు పని కల్పించుటంలో 100రోజుల పని కల్పిండంలో అత్యదిక సగటు వేతనం పొందటంలో, కూలీలకు సకలంలో వేతనాలు చెల్లించడంలో వికారాబాద్ జిల్లా రాష్టంలోనే మొదటి స్థానంలో ఉందని డిఆర్‌డిఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రూ.114.83 కోట్ల,మెటిరియల్‌కు 75.93 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో సిసి రోడ్లు నిర్మాణ పనులు చేపట్టి 60.73 కోట్ల రూపాయలు ఖర్చుచేయడమైనది. ఈ ప్రగతిని సాధించడంలో భాగస్వాములయిన ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసిలు, ఏపిఓలు, ఎంపిడిఓలు, డిఆర్‌డిఏ సిబ్బందికి, కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

## సఫిల్‌గూడపార్క్ సమస్యకు పరిష్కారం




**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి :** మల్కాజ్‌గిరి సఫిల్‌గూడ పార్కులో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఒత్తిడి నుంచి బయట పడేందుకు వ్యాయామం దోహదపడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో గురువారం పర్యటించిన వారు మాట్లాడుతూ పార్కులో ఉన్న సమస్యలతో పాటు గుర్రపుడెక్క తొలగింపు, జిమ్ పరికరాల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. మల్కాజ్‌గిరి ఎంపిగా తనను గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై పార్లమెంటులో కొట్లాడుతానని రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంబిసి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, నాయకులు బద్దం పరశురాంరెడ్డి, జేఏసి వెంకన్న, రావుల అంజయ్య, రాము యాదవ్, నవీన్ యాదవ్, మల్లేష్ యాదవ్, ఉపేందర్, శ్రీనివాస్‌గౌడ్, ఇబ్రహీం, సాదిక్, ఫరీద్ పాల్గొన్నారు.

## డ్రయినేజీ సమస్య పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** శ్రీనగర్ కాలనీలో డ్రైయినేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఈస్ట్ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వారు గురువారం పర్యటించారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, బిఆర్‌ఎస్ నేతలు బద్దం పరశురాంరెడ్డి, రావుల అంజయ్య, జేఏసి వెంకన్న, రాము యాదవ్, నవీన్ యాదవ్, మల్లేష్ యాదవ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘన... మేయర్, డిప్యూటీ మేయర్‌పై కేసు

**ప్రజాపక్షం/ జవహర్‌నగర్:** ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే సహించేది లేదని జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు హెచ్చరించారు. జవహర్‌నగర్ మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో పాటు 5మంది కార్పొరేటర్లపై కేసు నమోదైంది. ఈ మేరకు గురువారం మున్సిల్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, ఎంసీసీ టీం వన్ అధికారి ప్రభాకర్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మేయర్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహా 5మంది కార్పొరేటర్లపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఈ నెల 27న మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించడమే కాకుండా ఆసరా పింఛన్లు పంచుతూ దొరికారు. వీటికి సంబంధించిన ఫోటోలు నెట్టింటా వైరల్ అయ్యాయి. దీంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లపు రవి, శారద, నాగరాణి, ప్రేమల శ్రీనివాస్, లావణ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపారు.

# మల్కాజిగిరి మరోసారి కాంగ్రెస్‌దే

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మల్కాజిగిరి పార్లమెంటు ప్రాంతమంతా మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బలీయంగా ఉన్న నియోజకవర్గమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డి భారీ మెజారిటీతో విజయం తథ్యమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉప్పల్‌లోని శ్రీరస్తు ఫంక్షన్ హాలులో గురువారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పార్టీ అభ్యర్థి సునీతారెడ్డితో పాటు ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. ముఖ్యమంత్రి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరిలో తిరిగి ఘన విజయం సాధిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రణాళికా యుక్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు కాలనీలు, సంక్షేమ సంఘాల వారితో నిత్యం మమేకమవ్వాలన్నారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఉప్పల్, చెర్లపల్లి, కాప్రా కార్పొరేటర్లు రజిత, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, పార్టీ నేతలు తౌఫిక్, ఆగిరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, సీతారామ్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, అరుణ్, రామకృష్ణ, సుర్వి, మురళిగౌడ్, గిరిబాబు, రఫిక్, వెంకట్‌రెడ్డి, నాగశేషు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** నియోజకవర్గంలో డ్రైనేజీ,వాటర్ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కాలనీలలో ఎంఎల్ఎ పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కాలనీలలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేష్‌గౌడ్, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనిల్, వెంకటేష్‌గౌడ్, గిరిబాబు, రాజేశ్వర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, మహిపాల్ రెడ్డి, అశోక్, శ్రీశైలం, శ్రీనివాస్ నాయక్, మహేందర్ పాల్గొన్నారు.



## తాగునీటికి ఇబ్బందులు రానివొద్దు

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలో మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషన్‌లతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బోర్‌వెల్స్, చేతి పంపులు పనిచేయనట్లయితే ఏప్రిల్ 5వతేది లోపు మరమ్మతుల పనుల పూర్తి చేసి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీరు అందించడంలో అలసత్వం వద్దన్నారు. మిషన్ భగీరథ నీరు అనివార్య కారాణలవల్ల నిలిచిపోయినట్లయితే ప్రత్యామ్నాయంగా తాగునీటిని అందించేందుకు ముందుస్తు కార్యాచరణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మిషన్ భగీరథ, ఎగ్జిక్యూటివ్, ఇంజనీర్లు బాబు, శ్రీనివాస్, నాగేశ్వరావు, మిషన్ భగీరథ ఏఈలు,మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు తప్పని సరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 ద్వారా సిఇఓ కార్యాలయ వెబ్‌సైట్‌లోని పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి వివరాలను ఎన్‌ఐసి ద్వారా పొందుపరచి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా ప్రభుత్వ విభాగ అధికారులు బాధ్యతాయుతంగా తమ సిబ్బంది ద్వారా ధరఖాస్తు చేసుకొనేలా చూడాలన్నారు. మే 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి ధరఖాస్తు చేసుకొన్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటు వేసే ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వచ్చే ఇతర జిల్లా ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ సెలవు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా పరిజ్ఞానం




**ప్రజాపక్షం/నిజాంపేట్ :** సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సిఎస్ఎ బెంగుళూరు ఛాప్టర్ అధ్యక్షురాలు దివదారి సత్యవతి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ అండ్ డెటాసైన్స్ విభాగం క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సాంకేతికాభివృద్ధి, కెరియర్ అవకాశాల గురించి ఒకరోజు సదస్సు నిర్వహించారు. క్లౌడ్ సెక్యూరిటీ అలయన్స్ బెంగుళూరు ఛాప్టర్, ఐఎస్‌సి టూ ఛాప్టర్ హైదరాబాద్ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో డిజిటల్ సెక్యూరిటీకి సంబందించిన వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ఠాతులు డేటా, అప్లికేషన్స్, క్లౌడ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి రంగాల్లో భద్రతాపరమైన సాంకేతిక పరిజ్ఞానం, విపత్తులు, విపత్తు నిర్వహణ ఎంత ముఖ్యమో సోదాహరణంగా వివరించారు. ప్రారంభోత్సవంలో కళాశాల ప్రధానాధ్యాపకులు ఆచార్య డాక్టర్ సిడి నాయుడు, సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవరావు, సిఎస్ఇ సిఎస్‌డిఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎమ్.రాజశేఖర్, సమన్వయ కర్తలు డాక్టర్ వి.ప్రశాంతి, జి.మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడి నాయుడు మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటిని గమనిస్తూ సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా తమ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఉద్భోదించారు. రాజశేఖర్ మాట్లాడుతూ సైబర్ భద్రత రంగంలో మార్పులు వేగంగా వస్తాయని, విజగరుడ పేరిట ఏర్పరిచిన విజిలెన్స్ క్లబ్ ద్వారా ఆయా మార్పులను అర్థమయ్యే విధంగా అందిస్తామని వివరించారు.

## అవసరమైన విషయాలపైనే దృష్టి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు ఎల్లప్పుడు ప్రశాంత వాతావరణాన్ని కోరుకోవాలని హార్ట్‌ఫుల్‌నెస్ శిక్షకుడు కె ఎన్ పి రావు అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలో టిఎస్‌డబ్ల్యుఆర్‌డిసి జగద్గరిగుట్ట మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రశాంతతపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రశాంతి, లక్ష్మిలు విద్యార్థులకు మెడిటేషన్ చేయించారు. విద్యార్థుల మనసును ప్రశాంతంగా ఉంచాలని, విద్యార్థులు అనవసరమైన విషయాలపై దృష్టి సారించకుండా చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుందని వారు తెలిపారు. అనంతరం హార్ట్ ఫుల్‌నెస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో అనుభవారాహిత్య పాలన

### మాజీ ఎంఎల్ఎ ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఆకస్మికంగా దక్కిన ముఖ్యమంత్రి పదవితో రేవంత్‌రెడ్డికి మూడు మాసాల్లోనే కళ్లు నెత్తినెక్కడంతో ప్రధాని మోడిని సైతం దూషిస్తూ మాట్లాడుతున్నాడంటూ మల్కాజిగిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శించారు. మంత్రిగా సైతం పనిచేయని సిఎం రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం కారణంగా రాష్ట్రంలో పాలన కుంటు పడిందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చుకోలేక గత పాలకులు ఖజానా దివాళా చేసి చిప్ప చేతికిచ్చారని, ప్రతి రోజు విమర్శిస్తూ కుంటి సాకులు చెప్పటం మినహా ఏ ఒక్క పనినీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేక పోతున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. ఎక్కడి నుండి ఏ విధంగా నిధులు సేకరించాలో అన్న విషయాలపై అవగాహన లేనటువంటి సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర పథకాలను అమలు చేస్తాననటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల నిరంకుశ పాలనతో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణా చేస్తానంటూ గత ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ పాలనతో చేసిన మోసాల కారణంగా ఇంటికి పంపించారని, ప్రస్తుతం కెసిఆర్ నిజస్వరూపం తెలుసుకొని ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారని, పరిస్థితుల్లో ఉనికి సైతం కోల్పోతున్న బిఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేయడం నిరర్థకంగా మారుతుందన్నారు.

## ప్రశాంతంగా ఎంఎల్‌సి ఉపఎన్నిక




**ప్రజాపక్షం/కొడంగల్ :** ఉమ్మడి పాలమూర్ జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఉప ఎన్నికకు కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని కొడంగల్, బోంరాస్‌పేట, దౌల్తాబాద్ మండల కేంద్రాలలో మొత్తం 56ఓట్లు ఉండగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ శివమ్మ తన ఐడి కార్డును మరిచిపోవడంతో పోలింగ్ కేంద్రంలోకి పోలీసులు అనుమతించకపోవడంతో దాదాపు 15 నిమిషాల పాటు మండుటెండలో ఓటు వేసేందుకు రోడ్డుపైనే వేచి ఉంచారు. అనంతరం ఐడి కార్డు తీసుకువచ్చి ఓటు వేసేందుకు వెళ్లారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని సూల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ కిష్టమ్మ 92 సంవత్సరాల వృద్దురాలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టం చేశారు. కొడంగల్‌లో శాసనమండలి ఉప ఎన్నికలో పూర్తిగా వంద శాతం ఓటింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## బౌరంపేటలో అక్రమ నిర్మాణాలు

### చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బౌరంపేట ఆర్కే టౌన్షిప్‌లో, కంజర్వేషన్ జోన్‌లో కాలం చెలిన గ్రామపంచాయతీ అనుమతులతో ఆరు విల్లాలతోపాటు ఒక బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ అధికారులు చూసి చూడనట్టు వదిలేయడంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భారీ భవనాలు మున్సిపల్ అనుమతులు లేకుండా ఏకంగా కన్జర్వేషన్ జోన్లో నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. నిబంధనలు ఉల్లంగిస్తూ అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా మున్సిపల్ శాఖ అధికారులు తమ విధులను నిర్వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో నిర్మాణాలను తొలగించడం లేదని చర్యలు గాలికి వదిలేస్తున్నారని పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని అంటున్నారు. గతంలో దుండిగల్ మున్సిపల్‌లో టిపిఓ అధికారి పూర్తిస్థాయిలో లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు అడ్డు అదుపులేకుండా కొనసాగాయి, కానీ ఇటీవలే విధుల్లో చేరిన టీపిఓ అయిన మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాణాలకు అడ్డుకట్ట వేసి బోరంపేట్ ఆర్కే టౌన్షిప్‌లో నిర్మాణాలను తొలగిస్తారు లేదో చూడాలి.

## జిహెచ్‌ఎంసి వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్‌ఎంసి వాహనం ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ షఫీ తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ వాసవి శివనగర్‌లో నివాసముండే బండారపు సౌందీత్ తండ్రి సూరయ్య(61) గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లాడు. డి మార్ట్ వద్ద జిహెచ్‌ఎంసి వాహనం(టిఎస్ 08 యుఎ 7459)నిర్లక్షంగా నడుపుతూ సూరయ్యను ఢీకొనగా గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## బిజెపి గెలవాలని పూజలు

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** బిజెపి మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలవాలని మౌలాలీ డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్‌లోని హనుమాన్ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గడప గడపకు బిజెపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ యాదవ్, లింగారావు, కిరణ్, శ్రీనివాస్ యాదవ్, శివకుమార్, నటరాజ్, వేణు, రాజు, మహేష్ యాదవ్, మనోజ్, సురేష్, మధు, గణేష్ యాదవ్, మధు యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తరి లక్ష్మమ్మ వర్ధంతి

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** ఎత్తరి మారయ్య తల్లి ఎత్తరి లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో, ద్వారకామయి సేవ సమితి అనాధ ఆశ్రమంలోని బాలలకు భోజనం, అరటి పళ్ళు మరియు నిత్యవసర సరుకులు ఒక బియ్యం బ్యాగు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్, సీనియర్ నాయకులు గండయ్య, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్, సామజిక కార్యకర్త మధుబాబు చికిలే, సంస్థ నిర్వాహకులు రఘునాథ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో సిఎంఆర్ షాపింగ్ మాల్ పునఃప్రారంభం



**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ అయిన సిఎంఆర్ షాపింగ్ మాల్ ఉప్పల్ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బ్రాంచ్‌ను మరింత విశాలంగా, వైభవంగా మార్చి సినీనటి నిధి అగర్వాల్‌తో పునఃప్రారంభం చేశారు. వజ్రం కన్స్ట్రక్షన్స్ చైర్మన్ కోల ఆంజనేయులు మొదటి కొనుగోలు చేశారు. ఈసందర్భంగా సిఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ ఉప్పల్ సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను మరింత విశాలంగా, వైభవంగా అన్ని సెక్షన్లను తీర్చిదిద్ది పునఃప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. సిఎంఆర్‌లో షాపింగ్ అంటే ప్రపంచస్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందని, ప్రజలు తమకు కావాల్సిన అన్నిరకాల వేడుకలకు అతి తక్కువ ధరలకే అందిస్తుందని, తదనుగుణంగా అన్ని మోడల్స్ కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అందించటమే సిఎంఆర్ ప్రత్యేకత అన్నారు. కాగా, సినీతార కుమారి నిధి అగర్వాల్ షాపింగ్ మాల్‌ను అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలు పరిశీలించారు. గత 3 సంవత్సరాలుగా తాను సిఎంఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉందన్నారు.



## కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

**ప్రజాపక్షం / పెబ్బేరు** : పెబ్బేరు మండల పరిధిలోని బున్యదిపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గురువారం డా. జిల్లెల చిన్నారెడ్డి నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్ సమక్షంలో విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో 30 మంది భారాసాకు చెందిన కార్యకర్తలు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి , కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరి సమన్వయంతో గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, కృపాకర్‌రెడ్డి, వల్లపురెడ్డి, రణధీర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో వివాహిత మృతి

**ప్రజాపక్షం / పాన్‌గల్** : పాన్‌గల్ మండలంలోని రేమొద్దుల గ్రామానికి చెందిన హర్షన్న యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు రంగాపురం శివారెడ్డి సతీమణి రంగాపురం స్వప్న (35) గురువారం గుండె పోటుతో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటయ్య నాయుడు , వీరసాగర్ , విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరిచారి, ప్రసాద్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్ , రామకృష్ణ, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఆకస్మికదాడులు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి** : ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా మండలంలోని జొన్నలబొగుడ తండా, సాతాపూర్, యంగంపల్లితండా గ్రామాలలో గుడుంబాస్థావరాలపై గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని 15వేలలీటర్ల బెల్లంపాకం ధ్వంసంచేసి ముగ్గురిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. సాతాపూర్ గ్రామంలో 13లీటర్లను సీజ్‌చేసి ఒకవ్యక్తిపై కేసు నమోదుచేయడం జరిగిందన్నారు. ఈదాడుల్లో సీఐ నాగిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, డిటిఎఫ్ ఎస్ఐ అరుణ, కొల్లాపూర్ ఎస్ఐ హన్మంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## బొలెరో అదుపు తప్పి గాయాలు

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం** : మండల పరిధిలోని నాగసానిపల్లి నుంచి బుసిరెడ్డిపల్లి గ్రామానికి శుభకార్యానికి వెళ్తున్న బొలెరో వాహనం శ్రీరంగాపురం గ్రామం దాటిన తర్వాత అదుపు తప్పి ప్రమాదానికి గురైందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం డ్రైవర్ మీసపాల రాజు వాహనాన్ని అతివేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొట్టగా నాగసాని పల్లె గ్రామానికి చెందిన వ్యక్తులు ఆంజనేయులు , చెన్నమ్మ, సాయమ్మ, సాయి, తేజ, చిన్న బిసన్న, చెన్నమ్మ, చిట్టెమ్మ, శంకరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదానికి గురైన వ్యక్తులను మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన ఆంజనేయులు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ , శ్రీరంగాపురం మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు యాదవ్ , వనపర్తి ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

## వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/వెల్దండ** : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వెల్దండ ఎస్ఐ ఆధ్వర్యంలో అంతర్‌జిల్లా బార్డర్‌చెక్‌పోస్టు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ఈసందర్భంగా కొట్రచౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రవి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేసి పంపిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం విలువైన వస్తువులు తరలకుండా ఎవరైన రూ.50వేలకంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు తగిన ధృవపత్రాలు వద్ద ఉంచుకోవాలని లేనిచో సీజ్‌చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించనున్నట్లు తెలిపారు.

## న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా మోహన్‌కుమార్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్** : న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సి. మోహన్‌కుమార్ యాదవ్ గెలుపొందారని ఎన్నికల అధికారులు ఉత్తరయ్య రరఘు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బాల నాగయ్య, మహిళా ప్రతినిధిగా శ్రీదేవి ఎన్నికలలో విజయం సాధించారని వారు తెలిపారు. పోటీలో ఎవరు లేకపోవడంతో ఉపాధ్యక్షులుగా దేగల కృష్ణయ్య , జె. బ్రహ్మయ్యచారి, సహాయ కార్యదర్శిగా పి. శంకర్ , కోశాధికారిగా ఎం. ఆంజేయులు, క్రీడల అధికారిగా ఎన్ రందూలి గ్రంథాలయ కార్యదర్శిగా ఎం. కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజి రియాజ్ అహ్మద్ , త్రినాథ్ , తిరుపతయ్య, వేదవ్యాస్ ఎన్నికయ్యారని వారు పేర్కొన్నారు. నూతన న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఏప్రిల్ ఒకటిన ప్రమాణ స్వీకారం ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి** : నారాయణపేట జిల్లా కోర్టులో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన నారాయణపేట జిల్లా కోర్టు బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా దామోదర్‌గౌడ్ , కార్యదర్శిగా చెన్నారెడ్డికు స్వీట్లు అందజేసి సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రాం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ , సంతోషం వ్యక్తం చేసి జిల్లా కోర్టు ఆవరణలో గురువారం మిఠాయి తినిపించారు.

# కాంగ్రెస్‌దే ఘన విజయం

### ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపిటిసిలను కనీసం మనుషులుగా కూడా గౌరవించలేదని, వారు ప్రజల చేత ఎన్నుకున్న వారు ఇన్నాళ్లు ఉన్నారని, కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సభలో స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్థానిక సంస్థలను పటిష్టంగా తయారు చేసినప్పుడే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందరికి అందుతాయని, స్థానిక సంస్థల బలోపేతానికి కృతనిశ్చయంతో ఉన్నామని మహబూబ్నగర్ బహిరంగ సభలో స్పష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. ఎంపిటిసిలు కేవలం ప్రజల చేత ఎన్నుకోబడిన వారిగా మాత్రమే గుర్తింపు ఉందని వారు ప్రజలకు ఏవిధమైన సంక్షేమ ఫలాలు అందించలేని దుర్భరమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎంపిటిసిల ఆత్మగౌరవం పెంపొందించే విధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఇప్పుడు స్వేచ్ఛను కోరుకుంటున్నారని, అందుకే మేము ప్రజాస్వామ్య పద్దతిలో మా అభ్యర్థి జీవన్ రెడ్డి కి ఓటు వేయాలని అభ్యర్థించామని రాష్ట్ర ఎంపిటిసి అధ్యక్షుడు సైతం రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడిన తర్వాత ఎంపిటిసిల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని వారికి ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాతో వారు ఎమ్మెల్సీ ఎన్నికల




కోసం వేసిన నామినేషన్‌ను ఉపసంహరణ చేసుకున్నారని, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మంది ఎమ్మెల్యేలం ఎవరము క్యాంపు రాజకీయాలు చేయాలేదని, ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో ఉన్నామని, కానీ దేశంలో చక్రం తిప్పుతామని, కాబోయే ముఖ్యమంత్రి అంటూ ప్రచారాలు నిర్వహించుకున్న కల్వకుంట్ల వారసుడు ఇప్పుడు కేవలం ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం దిగజారుడు రాజకీయాలకు చేస్తూ గోవాలో ఎంపిటిసి సభ్యులతో కలిసి జల్సాలు చేస్తున్నారని ఆయన అక్కడ ప్రవర్తన చూసి జుగుప్సాకరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. వ్యాపారులను రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం ధ్వంసం చేసి నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, పోలీసు వ్యవస్థను సైతం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారని ఆయన మండిపడ్డారు. అందుకే ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటున్నారని, స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రెస్‌కు అండగా ఎంపిటిసిలు నిలుస్తున్నారని ఆయన తెలిపారు.



## అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/జడ్చర్ల** : డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షల విభాగం మహిళా సాధికారిత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లలో వచ్చే నోటిఫికేషన్‌లపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియ చిన్నమ్మ మాట్లాడుతూ లక్ష్యాల స్థాయి ఉన్నతంగా ఉన్నప్పుడు ఉన్నతమైన ఉద్యోగాలు సాధించడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్ ప్రధాన వక్తగా వచ్చారు. వీరు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రస్థాయిలో ఉన్నత ఉద్యోగాలుగా భావించబడే సివిల్ సర్వీసెస్ సాధించాలంటే ఆసక్తి , పట్టుదల, నిరంతర ప్రయత్నం ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులు, పోటీ పరీక్షల విభాగం కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ యాదయ్య, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎన్. సుభాషిని, అధ్యాపకులు, డా.కళ్యాణి, నరసింహారావు, విక్రమ్, బాలరాజు, జగన్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎంఎల్‌సి ఉపఎన్నిక

### రిసెప్షన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగు సామాగ్రి భద్రపరిచే ఏర్పాట్లు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి** : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ లలో ఎంఎల్‌సి ఉప ఎన్నిక పోలింగు అనంతరం అన్ని పోలింగు కేంద్రాల నుండి సాయుధ పోలీసు బందోబస్తుతో బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామాగ్రిని అందజేశారు. వాటిని పరిశీలన చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. రిసెప్షన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామాగ్రి భద్రపరిచే ఏర్పాట్లు ఎన్నికల పరిశీలకులు వాణి ప్రసాద్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్‌లు పర్యవేక్షణ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్** : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 100 రోజులలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేశారని అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. వనపర్తి జిల్లాలో గురువారం ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటల వరకు ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మహబూబ్‌నగర్ స్థానిక ఎన్నికల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదైందని, ఎన్నికల అధికారులు వెల్లడించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో 14 మండలాలకు సంబంధించి జరుగుతున్న ఓటింగ్‌లో 100 శాతం పూర్తి అయింది. మహిళా ఓటర్లు 119 మంది, పురుష ఓటర్లు 99 మంది మొత్తం 218 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





### ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి జూపల్లి

**పెద్దకొత్తపల్లి** : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకుచెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలలోభాగంగా కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో తమ ఓటుహక్కు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు వినియోగించుకున్నారు.

### ఓటుహక్కు వినియోగించుకున్న ఎంఎల్‌సి, ఎంపిటిసిలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి** : మహబూబ్‌నగర్ స్థానికసంస్థల ఉప ఎన్నికలపోలింగ్ నేపథ్యంలో కల్వకుర్తి ఎంఎల్ఎ కసిరెడ్డి నారాయణరెడ్డి , నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పివైస్‌చైర్మన్ బాలాజి సింగ్‌తోపాటు స్థానిక కౌన్సిలర్లతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకుచెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఉప ఎన్నికల లోభాగంగా గురువారం కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వబాలికల కళాశాలలో పెద్దకొత్తపల్లి మండల ఎంపిటిసిలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కు వినియోగించుకున్నవారిలో ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పిటిసి మేకలగౌరమ్మ చంద్రయ్య, వైస్ ఎంపిపి దీపిక లక్ష్మణరావు, తలారివెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, రామచందర్ ఉన్నారు.

### పోలింగ్‌కేంద్రాన్ని సందర్శించిన ఆడిషనల్ కలెక్టర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి** : పట్టణంలోని ప్రభుత్వ జడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల సమీపంలోని పైకభవనంనందుగల పోలీస్‌స్టేషన్ 7లో జరుగుతున్న ఎంఎల్‌సి ఉప ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రంలోనికి ఓటుహక్కును ఉన్నవారిని మాత్రమే అనుమతించాలని, సెల్‌ఫోన్, పెన్ను ఇతర వస్తువులను పోలింగ్‌కేంద్రంలోనికి అనుమతించకూడదని పోలింగ్ అధికారులకు, పోలిస్‌అధికారులకు సూచనలు చేశారు.



## పలు వివాహ వేడుకల్లో రావుల

**ప్రజాపక్షం / కొత్తకోట** : కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో గురువారం కొత్తకోట శ్రీనివాసులు కుమార్తె , బాజా వెంకటయ్య కుమార్తె వివాహాలకు మాజీ ఎంఎల్ఎ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధువరూలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్యసాగర్ , బాలయ్యనాయుడు, గిరన్న, వాకిటి నర్సింహ, వెంకట్ కుమార్ , నాగరాజు, గోవర్ధన్ , వడ్డే నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర కొరియాపై ఆంక్షల తీర్మానంపై రష్యా వీటో

**న్యూయార్క్ సిటీ:** ఉత్తర కొరియాపై ఆంక్షలు కొనసాగించాలన్న ప్రతిపాదనతో ఐక్యరాజ్య సమితి (యుఎన్)లో గురువారం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రష్యా వీటో చేసింది. ఉత్తర కొరియా పలు క్షిపణి ప్రయోగాలను చేపడుతున్నదని, సైనిక విన్యాసాలను కొనసాగిస్తున్నదని ఆరోపిస్తూ, యుఎన్ నిపుణుల బృందం కొన్ని ఆంక్షలను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఆ ఆంక్షలను మరో సంవత్సరంపాటు కొనసాగించాలన్న ప్రతిపాదనపరిశీలించి, ఆంక్షలు విధించాలని తన నివేదికలో సూచించింది. 15 సభ్య దేశాలున్న భద్రతా మండలిలో అమెరికా మద్దతునిచ్చిన ఈ తీర్మానానికి అనుకూలంగా 13 వచ్చాయి. ఓటింగ్‌కు చైనా గైర్హాజరైంది. రష్యా వీటో చేయడంతో, ఈ తీర్మానం వీగిపోయింది. ఉత్తర కొరియా గొంతు నొక్కడానికి పాశ్చాత్య దేశాలు ప్రయత్నిస్తున్నాయని యుఎన్‌లో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియా అణు కార్యకలాపాల ఆరోపణలకు, ఆంక్షలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇలావుంటే, ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను ఈ తీర్మానం వల్ల మారవు.

## పాలస్తీనా కొత్త కేబినెట్

**రామల్లా (వెస్ట్‌బ్యాంక్):** పాలస్తీనా అథారిటీ (పిఎ) కొత్త కేబినెట్‌ను ప్రకటించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా పిఎకు నాయకత్వం వహిస్తున్న అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ గురువారం రాష్ట్రపతి డిక్రీలో కొత్త ప్రభుత్వాన్ని ప్రకటించారు. చిరకాల సలహాదారుగా ఉన్న మహ్మద్ ముస్తఫాను ఈ నెల ప్రారంభంలో ప్రధాన మంత్రిగా అబ్బాస్ నియమించారు. అమెరికాలో చదువుకొని, ఆర్థికవేత్తగా పేరు తెచ్చుకున్న ముస్తఫా, గాజా పునర్నిర్మాణంలో సహాయం చేయడానికి నిపుణులతో కూడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఇందు కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తానని ప్రమాణం చేశారు. కాగా, తాజా కేబినెట్ కూర్పులో ముస్తాఫా ప్రధాన మంత్రిగానే కాకుండా, విదేశాంగ మంత్రిగా కూడా వ్యవహరిస్తారు. ఇలావుంటే, అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా ఎంపికైన జియాద్ హబ్ అల్‌రిహ్ అబ్బాస్ గత ప్రభుత్వంలోనూ అదే శాఖను నిర్వహించారు. అంతకు ముందు ఆయన సెక్యులర్ ఫతా ఉద్యమంలో సభ్యుడుగా ఉన్నారు. ఆయన నిర్వహించనున్న శాఖ భద్రతా దళాలను పర్యవేక్షిస్తుంది. జెరూసలేం వ్యవహారాల ఇన్‌కమింగ్ మంత్రి, అష్రఫ్ అల్‌అవార్, 2021లో జరిగే ఎన్నికలలో ఫతా అభ్యర్థిగా పోటీ చేయడానికి తన నమోదు చేసుకున్నారు. అయితే ఆ ఎన్నిక నిరవధికంగా వాయిదా పడింది. కాగా, కొత్తగా ప్రమాణం చేయనున్న 23 మంత్రుల్లో కనీసం ఐదుగురు గాజా ప్రాంతానికి చెందిన వారు. అయితే, వారు ఇప్పటికే అక్కడే ఉన్నారా? లేదా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## రాయల్ ఫంక్షన్‌హాల్‌కు తాళం



**ప్రజాపక్షం/కల్వకుర్తి** : పట్టణ పరిధిలో నిర్మాణంచేసుకొని అసిస్మెంట్ చేయించుకోకుండా ఆస్తిపన్ను చెల్లించకుండా ఉన్న కమర్షియల్ భవనాలు అనగా ఫంక్షన్‌హాల్స్, రైస్‌మిల్లులు, పెట్రోల్‌పంపులు వంటివాటిని పురకమీషనర్ ఆశ్రిత్‌కుమార్ సందర్శించి చర్యలలోభాగంగా గురువారం పట్టణంలోగల కురుమిద్దరోడ్డులో ఉన్న రాయల్‌గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌కు అసిస్మెంట్ చేయించుకోనందున తాళంవేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అసిస్మెంట్ చేయించుకొని భవనాలకు తప్పనిసరిగా కార్యాలయమునకు డాక్యుమెంట్స్ సమర్పించి అసిస్మెంట్ చేయించుకోవాలని వెంటనే ఆస్తిపన్ను చెల్లించాలని కోరడం జరిగింది. అదేవిధంగా పట్టణ పరిధిలో బకాయిలు ఉన్న ఆస్తిపన్నువెంటనే చెల్లించాలని, ప్రస్తుతం ఆస్తిపన్ను పెనాల్టీపై 90శాతం రాయితీ ఉన్నందున ఈఅవకాశం మార్చి 31తో ముగుస్తుందని పట్టణప్రజలకు తెలియజేస్తూ ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రాజకుమారి, ఆర్ఐ చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## గురునాథ్‌రెడ్డికి చల్లా సన్మానం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** కొడంగల్ ఎమ్మెల్యే, (రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్) గురునాథ్ రెడ్డిని గురువారం మహబూబ్నగర్ ఎంపి అభ్యర్థి, సీడబ్ల్యూ సీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డిని శాలువాలతో వంశీచంద్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ నేపథ్యంలో తాజా రాజకీయ పరిస్థితులను చర్చించుకున్న ఇరువురు నేతలు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలను గురునాథ్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డిలు సమీక్షించారు.

### ఎనుముల తిరుపతిరెడ్డికి సన్మానం



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి గురువారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు , దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నే జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి తదితరులు ఆయనకు ఘనంగా సన్మానించారు.

## న్యాయవ్యవస్థపై వత్తిడి పెరుగుతుంది

### సిజెఐకి ఆరువందలకు పైగా సీనియర్ న్యాయవాదులు లేఖ

**న్యూఢిల్లీ** : న్యాయవ్యవస్థపై వత్తిడి పెడుతూ, న్యాయస్థానాల పరువుకు భంగం కలిగించే విధంగా కొన్ని 'స్వార్థ ప్రయోజన శక్తులు' ప్రయత్నిస్తున్నాయని భారత ప్రధాన న్యాయమూర్తికి సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా సహా దేశవ్యాప్తంగా ఆరు వందలకు పైగా సీనియర్ న్యాయవాదులు లేఖ రాశారు. ప్రత్యేకించి రాజకీయ నాయకులు అవినీతికి సంబంధించిన కేసులు విషయంలో ఇది ఎక్కువగా జరుగుతుందని ,ఈ ఎత్తుగడలు న్యాయస్థానాలకు నష్టం కలిగించడంతో పాటు, ప్రజాస్వామ్య వ్యవస్థ భయపెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కష్ట కాలంలో భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నాయకత్వం ఎంతో కీలకమైందని, అత్యున్నత న్యాయస్థానం దృఢంగా నిలబడాలని, ఇది గౌరవప్రదమైన మౌనం పాటించే సమయం కాదని స్పష్టం చేశారు. ఈ నెల 26న రాసిన ఈ లేఖ గురువారం అధికార వర్గాలు ద్వారా వెలుగులోకి వచ్చింది. పేర్లు చెప్పకుండా న్యాయవాదుల్లో ఒక వర్గం నిత్యం రాజకీయ నాయకులను పగలు సమర్థిస్తూ, రాత్రి వేళలో మీడియా ద్వారా న్యాయమూర్తులపై ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ స్వార్థ ప్రయోజన శక్తులు గత స్వర్ణ యుగ కాలాన్ని ఉటంకిస్తూ, ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉన్నట్లుగా తప్పుడు కథనాలను సృష్టిస్తున్నారని తెలిపారు. న్యాయస్థానాలపై ప్రభావం చూపించే విధంగా వారి వ్యాఖ్యలు ఉంటున్నాయని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 'ప్రమాదంలో న్యాయవ్యవస్థ – రాజకీయ, వృత్తిపరమైన వత్తిళ్ళ నుండి న్యాయవ్యవస్థ పరిరక్షణ ' అనే శీర్షకతో రాసిన ఈ లేఖపై ఆదిశ్ అగర్వాల్, చేతన్ మిత్తల్, పింకీ ఆనంద్, హితేశ్ జైన్, ఉజ్వల పవార్, ఉదయ్ హోల్లా, స్వరూపమ చతుర్వేది తదితర న్యాయవాదులు కూడా సంతకాలు చేశారు.

## కాంగ్రెస్‌ను వీడిన ధనిక మహిళ సావిత్రి జిందాల్



**చండీగఢ్:** దేశంలోనే అత్యంత ధనవంతమైన మహిళగా పేరు పొందిన సావిత్రి జిందాల్ కాంగ్రెస్ పార్టీని వీడారు. ఆమె కుమారుడు, పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ ఈ మధ్యే కాంగ్రెస్‌ని వీడి బిజెపిలో చేరారు. ఆయనకు కురుక్షేత్ర నుంచి లోక్ సభ ఎన్నికలకు కాషాయ పార్టీ టికెట్ కేటాయించింది. అయితే కొన్నాళ్లపాటు సావిత్రి కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సోషల్ మీడియా పోస్ట్‌లో ఆమె కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు ప్రకటించి గురువారం బిజెపిలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'నేను హిస్సార్ నియోజకవర్గంలో10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా చేశాను. హర్యానాకు కొన్నేళ్లు మంత్రిగానూ పని చేశాను. హిసార్ ప్రజలు నా కుటుంబం. నా కుటుంబ సభ్యుల సలహా మేరకు, నేను కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అంటూ హిందీలో పోస్ట్ చేశారు. కొద్ది రోజుల క్రితం సావిత్రి కుమారుడు మాజీ ఎంపి నవీన్ జిందాల్ కూడా కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మాజీ మంత్రి ఓపీ జిందాల్ కుమారుడు నవీన్.. కురుక్షేత్ర నుంచి ఈ సారి బిజెపి అభ్యర్థిగా బరిలో దిగబోతున్నారు.

## నార్వేలో గుడ్లకు కరువు

**హెల్సింకీ:** నార్వేలో కోడి గుడ్లకు తీవ్ర కరువు ఏర్పడింది. శుకవారం గుడ్‌ఫ్రైడే, ఆ తర్వాత ఆదివారం ఈస్టర్ పండుగలను నిర్వహించుకోవడానికి సిద్ధమైన నర్వే ప్రజలకు గుడ్లు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. కేకుల్లో గుడ్లను తప్పక వాడాల్సి ఉన్న నేపథ్యంలో ఎంతో మంది సరిహద్దున ఉన్న స్వీడన్‌కు వెళుతున్నారు. వీలున్నవారు అక్కడ గుడ్లు కొనుక్కొని తిరిగి వస్తుండగా, వీలు లేనివారు ఈస్టర్ వరకూ అక్కడే ఉండడానికి సిద్ధమై వెళుతున్నారు. మొత్తం మీద గుడ్ల కొరత నార్వేను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

## నిఘా సంస్థలపై దర్యాప్తు!

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ప్రభుత్వం దేశంలోని నిఘా సంస్థలపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు తేల్చడానికి సిద్ధమైంది. దర్యాప్తుకు ఆదేశించింది. కొన్ని బలమైన నిఘా సంస్థలు తమ పనుల్లో జోక్యం చేసుకుంటున్నాయని, ఫలితంగా స్వేచ్ఛగా విధులు నిర్వర్తించడం సాధ్యం కావడం లేదని ఇస్లామాబాద్ హైకోర్టుకు చెందిన ఆరుగురు న్యాయమూర్తులు ఇటీవల ఆరోపించారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, ప్రధాని షెబాజ్ షరీఫ్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కాజీ ఫయెజ్ ఇజా గురువారం సమావేశమైనప్పుడు, ఆరుగురు న్యాయమూర్తుల ఆరోపణల అంశం చర్చకు వచ్చింది. అనంతరం, ఈ విషయంపై అత్యున్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశిస్తున్నట్టు పాక్ ప్రధాని షాబాజ్ ప్రకటించారు. పాకిస్తాన్ ప్రభుత్వ వ్యవహారాల్లో సైన్యం, నిఘా సంస్థల జోక్యంపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. అయితే, న్యాయ వ్యవస్థలోనూ జోక్యం ఆరోపణలు రావడం విచిత్రం.

## నాటోపై దాడి చేయం..

**కీవ్:** నాటోపై యుద్ధం తమ అభిమతం కాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ స్పష్టం చేశారు. అయితే, ఉక్రేన్‌కు పంపించేందుకు వీలుగా, అమెరికాలో తయారైన ఎఫ్ 16 యుద్ధ విమానాలను సిద్ధంగా ఉంచిన స్థావరాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. నాటో కూటమిలోని దేశాలను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు దిగే అవకాశం ఉందని వచ్చిన వార్తలను పుతిన్ తోసిపుచ్చారు. అలాంటి ఆలోచన తమకు లేదని అన్నారు. కానీ, దేశ భద్రత, సార్వభౌమాధికారం విషయంలో రాజీ ఉండబోదని తేల్చిచెప్పారు. ఉక్రేన్‌కు అందించాలనే ఉద్దేశంతో అమెరికా కొన్ని యుద్ధ విమానాలను పంపిందని, అవి ప్రస్తుతం ఆగి ఉన్న స్థావరాలను విడిచిపెట్టబోమని అన్నారు. ఉక్రేన్‌కు ఆయుధాలు, విమానాల సరఫరాను రష్యా ఖండిస్తున్నదని అన్నారు.

## రెండవ విడత నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ** : దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రెండవ విడతలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 పార్లమెంట్ నియోజకవర్గాలకు గురువారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నామినేషన్ల దాఖలు కు చివరి తేదీ ఏప్రిల్ 14 కాగా, జమ్ముకశ్మీర్ మినహా 5న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జమ్ముకశ్మీర్‌లో మాత్రం 6న నామినేషన్ల పరిశీలన చేయనున్నారు.



హైదరాబాద్ తాజ్‌ఫలక్ నూమాలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచుడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# ఇడి, సిబిఐ దాడులతో బిజెపియేతర నాయకులకు బెదిరింపులు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం /మునుగోడు** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడి, సిబిఐ సంస్థలతో ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధింపులకు గురి చేస్తూ కేసులు నమోదు చేస్తూ లొంగ తీసుకుంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని బిజెపియేతర పార్టీల నాయకులను పలు అక్రమ ఆరోపణలు చేస్తూ మనీ లాండరింగ్ కేసుల పేరుతో ఇడి సిబిఐ లాంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని సబ్ ప్రయోజనాల కోసం వాడుకుంటుందన్నారు. బిజెపియేతర పార్టీల ముఖ్యమంత్రులు ఇతర ప్రముఖులపై పలు కేసులు నమోదు చేస్తూ జైల్లో పెట్టేందుకు కుట్ర చేస్తుందని రానున్న పార్లమెంటు ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. నరేంద్ర మోడీ ఎన్నికల ఫలితాలను తానే ముందుగా ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బిజెపికి దేశవ్యాప్తంగా 400 స్థానాలు వస్తాయని చెప్పడం ఈవిఎంల నిర్వహనపై తమకు అనుమానం ఉందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ఓటమి లక్ష్యంగా సిపిఐ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామచంద్రం, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను, గట్టుపల్లి నర్సిరెడ్డి, ఈదులకంటి కైలాస్, బండమీది యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ కార్మికులకు మౌలిక సదుపాయాలు సమకూర్చాలి

**ప్రజాపక్షం/సిరిసిల్ల** : భవన నిర్మాణ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సిరిసిల్ల లేబర్ అడ్డపై కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అడ్డాల మీద విశ్రాంతి గదులు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డాల మీద మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తంబ్ సిస్టం రద్దుచేసి కార్మికులకు లేబర్ కార్డులు ఇప్పించాలన్నారు. సిమెంట్‌లో పనిచేసిన కార్మికులకు, పెయింటింగ్ కార్మికులకు వేలు ముద్రలు రాక ఇబ్బందులు పడతున్నారని వెంటనే తంబు సిస్టర్ రద్దు చేయాలన్నారు. అర్హులైన కార్మికులకు లేబర్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఇక్కడి కాంట్రాక్టర్లు బీహార్ యూపీ కూలీలను తీసుకొచ్చి అతి తక్కువ కూలికి పని చేయించడం ద్వారా స్థానికంగా ఉన్న కార్మికులకు ఉపాధి దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, మల్లయ్య, దేవరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్

సింగరేణి యాజమాన్యానికి ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/మైటింక్లయిన్ కాలనీ** : సింగరేణి కంపెనీ యాజమాన్యం ఇటీ వలే విడుదల చేసిన ఉద్యోగ అవకాశాల్లో దివ్యాంగులకు (ఫిజికల్ హాండ్ క్యాప్డ్) 4శాతం ఉద్యోగ అవకాశాలు కలిపించాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు ఒక సంయుక్త ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. యాజమాన్యం విడుదల చేసిన ఇంటర్నల్, ఎక్స్ టర్నల్ నోటిఫికేషన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని, దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ కల్పించాలి రాజ్యాంగబద్ధంగా 2016 జీఓ ఉన్నప్పటికీ యాజమాన్యం దాన్ని విస్మరిస్తుందని నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, విడుదల చేసిన జీఓ లను సవరించి దివ్యాంగులకు జరగనున్న నష్టాన్ని నివారించేందుకు కృషి చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసనతో కూడి న ఆందోళన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, చట్టపరంగా కూడా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ప్రకా ష్, బ్రాంచ్ బాధ్యులు రాజరత్నం, బ్రాంచ్ కార్యదర్శి రవీందర్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు అన్నారావు, శాంసన్, సాంబశివరావు యాజమాన్యం హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు 31న శిక్షణా తరగతులు

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** : ఈ నెల 31 భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నిర్వహించే ఒక్క రోజు శిక్షణ తరగతులను కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించడం జరుతుందని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 :30 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.ఈ శిక్షణ తరగతులలో కార్మిక చట్టాలు లేబర్ కోడ్‌లు అనే అంశంపై యండి యూసుఫ్, 2వ పాఠంగా కార్మిక వర్గం ఎదురుకొంటున్న సవాళ్లు నాయకత్వ బాధ్యతలు వివిఎస్ బోస్,3వ అంశంగా మతం మతోన్మాదం లౌకిక వాదం కేంద్రంలో అమలవుతున్న హిందుత్వ ఎంజెండా ప్రొఫెసర్ శంకర్ నారాయణ,4వ పాఠం సింగరేణి రిటైర్డ్ కార్మికుల బెనిఫిట్స్ విధానాలు డి శ్యామ్ సుందర్ రెడ్డి రిటైర్డ్ డిజిఎం లు ఈ శిక్షణ తరగతుల్లో బోదించ నున్నారని రమేష్ తెలిపారు.కావున ఈ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులను అధిక సంఖ్య లో కార్మికులు పాల్గోని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : సుధాకర్ రెడ్డి**

ఈనెల 31 భూపాలపల్లి జిల్లా కేందర్రంలో జరిగే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులను కార్మికులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎఐటియుసి సీనియర్ మైనింగ్ స్టాప్ బ్రాంచ్ నాయకులు గుర్జేపల్లి సుధాకర్ రెడ్డి కోరారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే5 ఇంక్లైన్ లో కార్మికులను మైనింగ్ స్టాఫ్ సిబ్బందిని సుధాకర్ రెడ్డి కలిశారు. మైనింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ పి.నారాయణమూర్తి, పి.రామన్న, వై.ప్రకాష్, కే.తిరుపతి రెడ్డి, ఎం.శ్రీనివాస్, బి.బాబు పాల్గొన్నారు.

# ఏటా 2కోట్ల ఉద్యోగాలివ్వాలి?

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/దామెర** : కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని హన్మకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. గురువారం దామెర మండల సిపిఐ సమితి సమావేశం జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల కాలంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు.ఏట రెండు కోట్ల ఉద్యోగాలను ఇవ్వలేదని,ప్రభఉత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు, ప్రైవేటు పెట్టుబడి దారులకు అప్పగించి ఉన్న ఉద్యోగాలను తొలగించారని అన్నారు. రైతుల, వ్యవసాయ కూళీల సమస్యలను పరిష్కరించలేదని, రోజురోజుకు ఆకలి దారిద్ర్యం పెరిగిపోయిందని, నిరుద్యోగులు పెరిగి పోయారని అన్నారు. మరోవైపు మైనారిటీలు, ఆదివాసీలపై దాడులు జరిగినా పట్టించుకోలేదని అన్నారు.ఇతర దేశాలు సాంకేతికంగా అభివృద్ధి చెందుతుంటే బీజేపి మాత్రం ప్రజలను మూడనమ్మకాలలో ముంచుతున్నదని, అందుకే రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఆ పార్టీని ఓడించాలని అన్నారు. ఈ సమావేశంలో కొట్టెపాక రవితో పాటు పార్టీ మండల కార్యదర్శి అంబి సాంబయ్య, భాస్కర్, ఎడ్ల మంజుల, అమ్మసాంబయ్య, గంధం శోభ,జయ, శివ పాల్గొన్నారు.

# అభిలాష్ మృతిపై సమగ్ర విచారణ

వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి** : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో గల జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న అభిలాష్ అనే విద్యార్థి అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎంఎస్ఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతికి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థి ఆచూకీ తెలియక దాదాపు 24 రోజులు గడుస్తున్నప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో చాలా అనుమానాలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి చైర్మన్‌ను కలిస్తే ఎలాంటి స్పందన ఇవ్వలేదని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు తిమ్మాపూర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినప్పటికీ 24 రోజుల తర్వాత మృతదేహం దొరకడం చాలా బాధారకమన్నారు. కావున విద్యార్థి అభిలాష్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి మృతునికి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తదితరులున్నారు.

# బిజెపి నియంతృత్వ పాలన ఎండగడదాం : సీతారాములు




**ప్రజాపక్షం/ఆలేరు** : కేంద్రంలో బిజెపి నియంతృత్వ పాలనను ఎండగట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపెల్లి సీతారాములు అన్నారు. గురువారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి చేస్తున్న ఆగడాలను ఎండగట్టాలంటే కేంద్రంలో అధికారం కోల్పోవాలని తెలిపారు. భువనగిరి పార్లమెంటు సభ్యుడుగా ఎండి.జహంగిర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యవర్గ సభ్యులు మంగ నరసింహులు, జిల్లా నాయకులు నరసింహులు, ఎంఎ ఇక్బాల్ పాల్గొన్నారు.

# 'నవోదయ'లో... వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం





**ప్రజాపక్షం/గజ్వేల్** : ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వార్షిక పరీక్షలు పూర్తవడంతో విద్యార్థులను వత్తిడి నుండి ఉపశమనం కలిగించే క్రమంలో ఈనెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు బ్యాగ్ లెస్ డేస్ పాటిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ రాజేందర్ తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు వార్షిక పరీక్షలు పూర్తి కావడంతో మానసికంగా ఒత్తిడి తగ్గించి ప్రశాంతత, ఆహ్లాదం కోసం ఈ వినూత్న ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యాలయ విద్యార్థులను గ్రూపులుగా విభజించి పెయింటింగ్, గార్డెనింగ్, హ్యాండీక్రాఫ్ట్స్, నృత్యం, సంగీతం, వాయిద్యం, గిటార్ నేర్చుకోవడం, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ తదితర అంశాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు చురుగ్గా పాల్గొంటూ కొత్త విషయాలపై అవగాహన పొందుతుండగా, నూతన విద్యా విధానం ప్రకారం ప్రతి ఏటా రెండుసార్లు బ్యాగ్ లెస్ డేస్ జరుపుతున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. చదువు సంధ్యలతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసం వికసిస్తుందని వివరించారు.

# సమాజాన్ని ప్రభావితం చేసేది నాటకం

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు వంగరి త్రివేణి




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్** : నాటకం సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని అలాంటి నాటక సాహిత్యంపై విద్యార్థులు అధ్యయనం చేసి మరింత సృజనశీలురుగా మారాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు వంగరి త్రివేణి అన్నారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నాటక సాహిత్యం అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు లో భాగంగా రెండవ రోజు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. పురుషులే కాకుండా స్త్రీలు కూడా చాలా మంది నాటకాలను రాసి నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాహిత్యానికి అంతగా ఆదరణ కరువైందని, ఇప్పుడు స్వరాష్ట్రంలో తెలుగు సాహిత్యాన్ని ఆదరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలే కాకుండా పాలకులు కూడా తెలుగు సాహిత్యాన్ని, భాషను అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ తెలుగు భాషకు ప్రపంచ భాషల్లోనే ఒక ప్రధానమైన స్థానం ఉన్నదని, అటువంటి తెలుగు భాషా విశిష్టతను తెలియజేసేటువంటి అనేక సాహిత్య ప్రక్రియలు తెలుగులో వెలువడ్డాయని అటువంటి ప్రక్రియల్లో ఒకటైనటువంటి తెలుగు నాటక సాహిత్యంపైన ఈ రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడం వల్ల అనేకమంది పత్ర సమర్పకులు పత్రాలను సమర్పించడం చాలా సంతోషంగా విషయమని అన్నా రు. ఈ కార్యక్రమంలో నాటక రంగ పరిశోధకులు తాటికొండల నరసింహారావు, ఎన్ వి రఘువీర్ ప్రతాప్,రంగస్థలం నటులు, కోమలి కళా సమితి అధ్యక్షులు బక్క పిచ్చయ్య, ఎమ్. ఎల్. నరసింహారావు, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, అధ్యాపకులు డాక్టర్ ఎన్. దీపిక, డాక్టర్ వెల్దండి శ్రీధర్, జి. గోవర్ధనగిరి, ఎస్. ప్రభాకర్, డాక్టర్ టి. సైదులు, ఎం. లింగస్వామి, బి. రమ్య, డి. అంజయ్య, గ్రంధ పాలకులు డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్ ఫిజికల్ డైరెక్టర్ కడారి మ ల్లేష్, అధ్యాపకులు నాగుల వేణు, ప్రవీణ్ రెడ్డి, యాదగిరి రెడ్డి, ఇతర కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యాటగిరి ప్రమోషన్లలో కాలయాపన

కార్మికులను అయోమయానికి గురిచేస్తున్న సింగరేణి యాజమాన్యం

ఎఐటియుసి డిప్యూటీ కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్** : సింగరేణి యాజమాన్యం కార్మికులను అయోమయానికి గురిచేస్తుందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ 2022/23 సంవత్సరానికి సంబంధించిన క్యాటగిరి ప్రమోషన్ లను 2023 సెప్టెంబర్ నాటికి ఇవ్వాల్సి ఉండగా కాలయాపన చేశారని ఆరోపించారు. గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి డిమాండ్ మేరకు క్యాటగిరి ప్రమోషన్‌లను ఇచ్చుటకు యాజమాన్యం ప్రమోషన్ లెటర్లను సిద్ధం చేయగా, కొన్ని యూనియన్లకు సంబంధించిన రాజకీయ ప్రమేయం వలన వాటిని ఆపడానికి యాజమాన్యం చూస్తుందని విమర్శించారు. కార్మికులకు సంబంధించిన ప్రమోషన్ లెటర్లు ఇవ్వడానికి యాజమాన్యం గనుల పైకి పంపించిన ప్రమోషన్ లెటర్లను తిరిగి వాపసు తీసుకుందని దీని వలన కార్మికులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కొన్ని యూనియన్ల రాజకీయ జోక్యానికి యాజమాన్యం అడుగులకు మడుగులు ఒత్తుతూ ఎన్నికల కోడ్ పేరుతో ప్రమోషన్లను ఆపుతున్నారని, కార్మికులకు ప్రతి సంవత్సరం రావాల్సిన ప్రమోషన్లకు ఎన్నికలకు సంబంధం ఏంటని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. 202324 సంవత్సరానికి కార్మికులకు రావాల్సిన క్యాటగిరి ప్రమోషన్లు రాకపోవడం వలన తీవ్రమైన నష్టం జరుగుతుందని, 2024 మార్చినాటికి చెల్లించవలసిన ఇంక్రిమెంట్ కూడా జాప్యం జరుగుతుందని అన్నారు. యాజమాన్యం కార్మికులకు ఇవ్వవలసిన ప్రమోషన్ లెటర్లను వెంటనే ఇవ్వకపోతే గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, గునిగంటి నర్సింగరావు, బద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, మోతే లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా ఎన్నికల బాండ్ల నిధులు

(మొదటి పేజీ తరువాయి)

బాండ్ల ద్వారా ఈ సొమ్ము ముట్టింది. తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.542 కోట్లు, డిఎంకెకు రూ. 503 వైఎస్ఆర్‌సిపికి రూ.154 కోట్లు వంతున ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఎన్నికల బాండ్లు ఇచ్చింది. అవిధంగా మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ బిజెపికి రూ.584 కోట్లు, బిఆర్ఎస్ రూ.195 కోట్లు బాండ్ల ద్వారా పార్టీ నిధులు సమర్పించిందని ఎడిఆర్ పేర్కొంది. దేశంలో అత్యధికంగా బాండ్ల ద్వారా ఈ కంపెనీ ద్వారానే బిఆర్ ఎస్–బిజెపి పార్టీలు నిధులు దండుకున్నాయి. దేశంలో రాజకీయపార్టీలకు అత్యధికంగా బాండ్ల ద్వారా నిధులు సమకూర్చిన రెండో అతిపెద్ద కంపెనీగా దేశంలోనే మేఘా ఇంజనీరింగ్ సంస్థ రికార్డు సాధించింది. అదేవిధంగా డిఎంకెకు రూ.85 కోట్లు, వైఎస్ఆర్‌సిపికి రూ.37 కోట్లు, తెలుగు దేశం పార్టీకి రూ.28 కోట్లు సమకూర్చింది. మేఘా ఇంజనీరింగ్ సంస్థ ద్వారా దేశంలో అత్యధికంగా బిజెపి నిధులు సమకూర్చుకోగా, తర్వాతి స్థానంలో క్విక్ సప్లయ్ చైన్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా బిజెపికి ఎన్నికల బాండ్ల ద్వారా రూ.375 కోట్లు సమర్పించింది. మరో దాత వేదాంత లిమిటెడ్ కూడాబిజెపికి రూ.230 కోట్లు సమకూర్చింది. భారతీ ఎయిర్ టెల్ సంస్థ రూ.197.40 కోట్లు, మదన్‌లాల్ లిమిటెడ్ రూ.175 కోట్లు విలువైన బాండ్లు కొనుగోలు చేసి బిజెపికి ఇచ్చాయి. ఇక తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి భారీగా నిధులు సమర్పించిన కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ సంస్థే. ఆ తర్వాత హాల్దియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా మమతా బెనర్జీ పార్టీకి రూ.281 కోట్లు ఇచ్చిన కంపెనీగా రెండోస్థానంలో నిలిచింది.ధారివాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కూడా తృణమూల్‌కు రూ.90 కోట్లు ఇచ్చి మూడోస్థానంలో నిలిచింది. ఇక ఎంకెజె ఎంట్రప్రైజెస్ రూ.45.90 కోటు ముట్టజెప్పింది. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్‌ర్టీకి భారీగా kp. 125 కోట్లు నిధులు సమకూర్చిన కంపెనీ వేదాంతా సంస్థే. వెస్ట్రన్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ నుండి రూ.110 కోట్లు, ఎంకెజె ఎంట్రప్రైజెస్ నుండి రూ.91.60 కోట్లు, యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుండి రూ.64 కోట్లు,అవీస్ ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ సంస్థ నుండి రూ.53 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా కాంగ్రెస్‌పార్టీ సమకూర్చుకుంది. ఇక ఒడిశాలో ప్రాంతీయపార్టీ బిజూ జనతా దళ్‌కు అత్యధికంగా బాండ్ల దారి ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ నిధులు సమకూర్చింది. తెలుగుదేశం పార్టీ షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్ సంస్థ నుండి అత్యధికంగా రూ.40 కోట్లు తీసుకుంది. శివసేన పార్టీకి బి.జి షిర్కె కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ సంస్థ రూ.85 కోట్లు ఇచ్చింది. ఆర్‌జెడి పార్టీకి ఐఎఫ్‌బి ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.35 కోట్లు బాండ్ల ద్వారా ఇచ్చింది. భారత ఎన్నికల సంఘం ఈనెల 21వ తేదీన ఈ వివరాలను తన వెబ్‌సైటు ద్వారా ప్రజలకు ఈ వివరాలు వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ వివరాలు ప్రజలకు చేరాయి.

# అంతా ఓట్ల కోసమే

'అగ్నిపథ్'పై రక్షణమంత్రి మాటమార్చారు

అధికారంలోకొస్తే పథకాన్ని రద్దు చేస్తాం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ** : తీవ్ర విమర్శలకు గురైన ''అగ్నిపథ్'' పథకంపై కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం మాట మార్చి తప్పులు సరిదిద్దుకుంటామని చెప్పడం లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల ప్రయోజనాల కోసమేనని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇలా తప్పిదాలకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వం మొట్టమొదట దేశంలోని దేశభక్తులైన యువకులందరికీ క్షమాపణలు తెలియజేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని వెంటనే రద్దు చేస్తామని ఖర్గే అన్నారు. అగ్నిపథ్ యోజన దేశ భద్రతను తీవ్రంగా బలహీన పరచిందని ఆయ అన్నారు. ఈ పథకం కారణంగా దేశంలో యువకులు ఎవరూ సైన్యంలో కేంలం నాలుగేళ్ళ ముచ్చట కోసం చేరాలని కోరుకోవడం లేదని అన్నారు. దేశంలో ఉన్న 1.50 లక్షలమంది యువకులు, యువతులు దీనివల్ల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలదృష్టికి తెచ్చేందుకు 'జై జవాన్' అనేపేరుతో ప్రచారం ప్రారంభిస్తామని అన్నారు. ఎక్స్ వేదికగాఈ మేరకు ఆయన గురువారం ఒక పోస్టింగ్ పెట్టారు. న్యూఢిల్లీలో జరిగిన ''టైమ్స్ నౌ'' సమ్మిట్‌లో చివరిరోజు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, అగ్నిపథ్ పథకంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే దిద్దుబాట్లు చేసుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. దీనిపై ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్షణమంత్రి పరోక్షంగా చేసిన తప్పును అంగీకరించారని అన్నారు. మొదటినుండీ అగ్నిపథ్ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పథకం యువతకు ప్రమాదకరంగా మారిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన కేవలం ఎన్నికల నినాదంగా ఉందని ఖర్గే ధ్వసమెత్తారు. ''ఈ లోక్‌సభ ఎన్నికల్లో ''ఇండియా'' కూటమి అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకంలో కచ్చితంగా మార్చేస్తామని అన్నారు. మోడీ ప్రభుత్వం లక్షలాదిమంది దేశభక్తులైన యువతరం జీవితాలతో ఆటలాడుకుందని, దేశానికి కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని అన్నారు. అగ్నిపథ్ పథకాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'టైమ్స్ నౌ' కార్యక్రమంలో సమర్థిస్తూనే, లోటుపాట్లు ఉంటే సరిదిద్దుతామన్నారు. ఇప్పుడు అగ్నిపథ్ పథకాన్ని మోడీ ప్రభుత్వం ఎన్నికల నినాదంగా ముందుకు తీసుకువస్తోందని, అందుకే ఈ వ్యాఖ్యలు చేశారని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు హిందీలో ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. దేశానికి రక్షణమంత్రిగా ఉన్న రాజ్‌నాథ్ సింగ్ ఈ పథకాన్ని సమర్థిస్తూనే షరతులు విధిస్తూ సవరణలు చేస్తామని చెప్పడం, ఈ పథకానన్ని మెరుగు పరిచేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పడం సిగ్గుచేటని, ఇది ఎన్నికల ప్రయోజనంకోసం మాట్లాడే మాటలేనని విమర్శించారు. రాజ్‌నాథ్‌సింగ్ మాటలు వింటుంటే ఈ పథకం ఇంకెంతోకాలం పని చేయదని అర్థమవుతోందని సందేహం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్‌కు బిగ్‌షాక్

(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కాగా కడియం కావ్య కాంగ్రెస్ తరఫున పోటీ చేయవచ్చునని భావిస్తున్నారు. కడియం కావ్య లేదా కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంపిగా పోటీ చేయవచ్చునని భావిస్తున్నారు.. ఒకవేళ కడియం కావ్య కాంగ్రెస్ నుండి ఎంపిగా పోటీ చేస్తే కడియం శ్రీహరిని రాష్ట్ర ప్రభుత్వంలో క్యాబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మొత్తానికి రాష్ట్ర రాజకీయాలలో ఈ పరిణామం పెను సంచలనంగా పరిణమించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com